PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ ◆


ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 125 | విజయవాడ, బుధవారం 6 డిసెంబర్ 2023 | 6 + 8 పేజీలు | వెల : 5. 50

Vol No | Vijayawada, Wednesday 6 December 2023 | Rs





అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు వద్ద నేలకొరిగిన అరటి పంట

ముంచిన మిచౌంగ్

బాపట్ల సమీపంలో తీరం దాటిన తుపాను

- ఏడు జిల్లాల్లో తీవ్ర నష్టం
- 58 మండలాలపై తీవ్ర ప్రభావం
- వేలాది ఎకరాల్లో పంటనష్టం
- మరో 24 గంటలు వర్షాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మిచౌంగ్ తీవ్ర తుపాన్ రాష్ట్రంపై విరుచుకుపడింది. మంగళవారం మధ్యాహ్నం బాపట్ల సమీపంలో తీరం దాటింది. దాదాపు రెండు గంటల పాటు ఈ ప్రక్రియ కొనసాగింది. మధ్యాహ్నం 12.30 గంటల నుండి 2.30 గంటల మధ్య మిచౌంగ్ తీరం దాటినట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. తుపాన్ తీరం దాటుతున్న సమయంలో గంటకు 90నుండి 100, 120 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచాయి. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున వర్షం కురిసింది. కోస్తా జిల్లాల్లో వర్ష తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. తీరం దాటినసమయంలో తీవ్ర తుపాన్‌గా ఉన్న మిచౌంగ్ సాయంత్రానికి తుపాన్‌గా మారింది. బుధవారం ఉదయానికి మరింత బలహీనపడి వాయుగుండంగా మారనుంది. దీని ప్రభావంతో మరో 24 గంటల పాటు కోస్తా జిల్లాల్లో భారీ నుండి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో తుపాన్ తీరం దాటినా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఏడు జిల్లాల్లోని 58 మండలాలపై మిచౌంగ్ తీవ్ర ప్రభావం చూపింది. పల్లపు ప్రాంతాలు జలమయంగా మారాయి. పలు చోట్ల రోడ్లకు, కాలువలకు తేడా తెలియని పరిస్థితి ఏర్పడింది. వేలాది ఎకరాలు నీట మునిగాయి. పశ్చిమగోదావరి, నెల్లూరు, గుంటూరు, పల్నాడు, కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో తుపాన్ ప్రభావం తీవ్రంగా ఉంది. తిరుపతితో పాటు రాయలసీమలోని మరికొన్ని జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురిశాయి. భారీ వర్షాలు, ఈదురుగాలుల ధాటికి వరి, పొగాకు, పసుపు, అరటి పంటలు దెబ్బతిన్నాయి. అనేక చోట్ల పంట చేతికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఈదురుగాలుల ప్రభావంతో రాష్ట్రంలోని పలుచోట్ల విద్యుత్ స్థంబాలు, భారీ చెట్లు నెలకొరిగాయి. వీటిని తొలగించడానికి అధికారయంత్రాంగం

మిగతా 2లో



బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం చోడిపాలెం పరిధిలో నీటిలో తేలియాడుతున్న వరి ఓదెలు

ముగ్గురు మృతి

తుపాను కారణంగా మగ్గురు మృతి చెందారు. కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం పెందుర్రు గ్రామంలో దుకాణం తెరుస్తుండగా వర్షానికి విద్యుదాఘాతానికి గురై జొన్నల చిట్టిబాబు (43) మరణించారు. చీరాల మండలం, పేరాల ఉజిలీపేట అరవ కాలనీ వద్ద ఉంటున్న ఒక వ్యక్తి మూత్ర విసర్జనకు కాలువ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తూ అందులో పడి మృతి చెందారు. బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలంలో గుర్తు తెలియని యువకుడు నీటిమడుగులో పడి మరణించారు. ఇంకొల్లు-పావులూరు రోడ్‌లో రావి చెట్టు సమీపంలో రోడ్డు మార్గంలోని నీటిమడుగులో ఆ యువకుడి మృతదేహం కనిపించింది.

పొరపాట్లు లేకుండా సహాయక చర్యలు

- అధికారులకు సిఎం ఆదేశం


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



తుపాను సహాయక చర్యల్లో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకూడదని, వీలైనంత తొందరగా అందించే ఏర్పాట్లు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. తుపాను స్థితిపై మంగళవారం తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. అధికారులను అడిగి తుపాను వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. నెల్లూరు, తిరుపతి సహా తుపాను వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లో కరెంటు సరఫరా వ్యవస్థను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని ఆదేశించారు. మనుషులు, పశువులు మరణించినట్లు సమాచారం అందితే 48 గంటల్లోగా పరిహారం అందించాలని తెలిపారు. తుపాను తగ్గిన వెంటనే ఎన్యుమరేషన్ కూడా ప్రారంభం కావాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్ వ్యవస్థను వాడుకుని రేషన్ పంపిణీని సమర్థవంతంగా చేపట్టాలని అధికారులకు సిఎం సూచించారు.

తుపాను ప్రాంతాల్లో నేడు సిపిఎం బృందాల పర్యటన 2

సర్కారుకు సన్నద్ధత లేదు : చంద్రబాబు



తుపాను బాధిత ప్రజ లకు తక్షణ అవసరమైన ఆహారం, నీళ్ళు, షెల్టర్ ఇవ్వడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. తుపానుపై ప్రభుత్వ సన్నద్ధత లేదని, బాధితులకు సాయమూ లేదని అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి బాధిత గ్రామాల ప్రజలతో ఫోన్‌లో మాట్లాడారు. కనీసం భోజనం కూడా పెట్టలేదని, ప్రభుత్వ స్పందన సరిగ్గా లేదని వివిధ ప్రాంతాల ప్రజలు వివరించారు. పార్టీ నేతలు, కార్యకర్తలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూడకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధితులకు అండగా నిలవాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన బాధితులకు భోజనం, తాగునీరు అందేలా చూడాలని ఆదేశించారు. తుపానుకు ముందు ప్రజలను అలెర్ట్ చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు లెక్కలు వేసుకోకుండా ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించాలన్నారు.



చెన్నైలో బాధితులను తరలిస్తున్న దృశ్యం

చెన్నై విలవిల

- ఏడుగురు మృతి
- రూ. 5 వేల కోట్ల సాయానికి తమిళనాడు విజ్ఞప్తి

చెన్నై : మిచౌంగ్ తుపానుతో చెన్నై అతలాకుతలమైంది. ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు చెన్నై నగరం తడిసి ముద్దయింది. వర్షాలు సృష్టించిన బీభత్సానికి కేవలం చెన్నైలో ఏడుగురు చనిపోయారు. మంగళవారానికి వర్షాలు కాస్త శాంతించినా నగరంలో అనేక ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాంచీపురం, తిరువళ్లూరు, చెంగల్పట్టు జిల్లాల్లోనూ తుపాను ప్రభావం ఎక్కువగా ఉంది. మరో వైపు మరమ్మత్తులు కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి రూ 5 వేల కోట్ల మధ్యంతర సహాయాన్ని కోరతామని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తెలిపారు. ఎప్పుడూ లేని విధంగా కురిసిన వర్షాలతో నివాస ప్రాంతాలు, రోడ్లు దెబ్బతిన్నాయని వీటికి మరమ్మతులు అవసరం అని స్టాలిన్ తెలిపారు.

సెన్సెక్స్ @ 69 వేలు

- కొత్త రికార్డుల సృష్టి

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు పరుగులు పెడుతున్నాయి. వరుసగా ఆరు సెషన్లలో లాభాలతో నూతన రికార్డులను నమోదు చేశాయి. కొనుగోళ్ల మద్దతుతో మంగళవారం బిఎస్ఇ సెన్సెక్స్ 69వేల మార్క్‌ను దాటి నూతన చరిత్రను సృష్టించింది. మరోవైపు నిఫ్టీ 21వేల చేరువలో నమోదయ్యింది. వరుసగా ఆరో సెషన్‌లోనూ లాభాలను నమోదు చేశాయి. తుదకు బిఎస్ఇ సెన్సెక్స్ 431 పాయింట్లు పెరిగి 69,296కు చేరింది. ఇంట్రాడేలో 69,381 గరిష్ట స్థాయి వద్ద ట్రేడింగ్ అయ్యింది. మరోవైపు నిఫ్టీ 168.30 పాయింట్లు వృద్ధితో 20,855 వద్ద ముగిసింది. సెన్సెక్స్-30లో 20 షేర్లు రాణించాయి. పవర్‌గ్రిడ్, ఎన్‌టిపిసి, ఎస్‌బిఐ, ఐసిఐసిఐ బ్యాంక్, ఎంఅండ్‌ఎం, టైటన్, మారుతీ కంపెనీలకు చెందిన షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు హెచ్‌యుఎల్, హెచ్‌సిఎల్ టెక్, బజాజ్ ఫైనాన్స్, విప్రో, ఇన్ఫోసిస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఐటిసి స్టాక్స్ అధికంగా నష్టాలు చవి చూసిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. ఒక్క పూటలోనే బిఎస్ఇ మార్కెట్ కాపిటలైజేషన్ రూ.2.5 లక్షల కోట్లకు పైగా పెరిగి రూ.350 లక్షల కోట్ల మార్క్ దాటింది.

రైతులకు ఇచ్చే సాయం పెంచేది లేదు

- వ్యవసాయశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పిఎం-కిసాన్) కింద రైతులకు ప్రస్తుతం ఇస్తున్న రూ. 6 వేల సాయాన్ని పెంచే యోచనేదీ లేదని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ మంగళవారం లోక్‌సభకు తెలిపారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఒక సభ్యుడు అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో మంత్రి ఈ విషయం తెలియజేశారు.

జిడిపిలో 57.2 శాతం కేంద్ర ప్రభుత్వ అప్పు

2023-24లో కేంద్ర ప్రభుత్వం చేసిన అప్పులు జిడిపిలో 57.2 శాతంగా ఉన్నట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి మంగళవారం రాజ్యసభకు తెలిపారు. 2022-23లో ఇది 57.1 శాతంగా ఉంది. 2011-12 ధరల ప్రకారం కేంద్ర ప్రభుత్వ తలసరి రుణం రూ.58,709. 2022-23 మార్చి చివరి నాటికి కేంద్ర ప్రభుత్వ తలసరి రుణం రూ.58,709. అందులో తలసరి దేశీయ రుణం రూ.55,528 కాగా, తలసరి విదేశీ రుణం రూ.3,181. 2011-12లో కేంద్ర ప్రభుత్వ తలసరి రుణం రూ.29,127 మాత్రమే.. అందులో తలసరిదేశీయ రుణం రూ.26,481 కాగా, తలసరి విదేశీ రుణం రూ.2,641 అని మంత్రి ఒక ప్రశ్నకు



లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో తెలిపారు.

పెట్టుబడి వ్యయ సాయం కింద ఎపికి ఏమీ లేదు

2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆమోదించిన ఆర్థిక సహాయంలో ఆంధ్రప్రదేశ్‌కు ఎటువంటి సాయం లేదు. క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ కోసం రాష్ట్రాలకు ప్రత్యేక సహాయం స్కీమ్ కింద 2023-24 ఆర్థిక సంవత్సరానికి వివిధ రాష్ట్రాలకు ఆమోదించబడిన ఆర్థిక సహాయం వివరాలను రాజ్యసభలో కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి ప్రకటించారు. అందులో నవంబర్ 29న ఆమోదించిన ఆర్థిక సాయం తెలంగాణతోపాటు 26 రాష్ట్రాలకు ప్రకటించారు. తెలంగాణకు రూ.2,334.51 కోట్లు కేటాయించారు. ఆంధ్రప్రదేశ్, కేరళకు మాత్రం ఆమోదించలేదు. ఈ పథకం కింద నిర్దేశించిన అర్హత ప్రమాణాలు ఈ రెండు రాష్ట్రాలకు లేవని పేర్కొన్నారు. 2022-23లో విడుదల చేసిన సాయానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్‌కు రూ.6,105.56 కోట్లు విడుదల అయితే, యుటిలేజేషన్ సర్టిఫికెట్ (యుసి) అందజేయలేదని తెలిపారు. తెలంగాణకు రూ.2,500.98 కోట్ల సాయం విడుదల అయితే, అందులో రూ.2,124.16 కోట్లకు యుసిలు అందజేశారని తెలిపారు.

రేవంతే సిఎం

- ప్రకటించిన కాంగ్రెస్ అధిష్టానం
- రేపు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



తెలంగాణ నూతన ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డినే కాంగ్రెస్ అధిష్టానం ఎంపిక చేసింది. దీంతో గురువారం (ఏడవ తేది) ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఎఐసిసి కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ఎఐసిసి ప్రత్యేక పరిశీలకులు డికె శివకుమార్ , ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఈ మేరకు ప్రకటించారు. ఈ సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేతలు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క కూడా పాల్గొన్నారు. సిఎం ఎవరన్న ఉత్కంఠకు తెరపడటంతో కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో ఆమోదం ఇక లాంఛనమే! బుధవారం ఆ సమావేశం జరగనున్నట్లు తెలిసింది. మరోవైపు గత రెండు రోజులుగా హైదరాబాద్‌లో హోటల్లో ఐలాలో ఎంఎల్‌ఎలతో కలిసి ఉన్న రేవంత్‌రెడ్డిని తక్షణమే ఢిల్లీకి రావాలని అధిష్టానం ఆదేశించింది. దీంతో హుటాహుటిన ఆయన ఢిల్లీకి బయలుదేరారు. మంత్రివర్గ కూర్పుపై ఆయనతో అధిష్టానం చర్చించే అవకాశం ఉందని భావిస్తున్నారు. నూతన సిఎం ప్రమాణ స్వీకారానికి రాజ్‌భవన్‌లో అధికారయంత్రాంగం ఏర్పాట్లు చేసింది. అయితే, గురువారం ఉదయం 10.30 గంటలకు రేవంత్‌రెడ్డి ఎల్‌బి స్టేడియంలో ప్రజల సమక్షంలో ప్రమాణస్వీకారం చేస్తారని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. ఈ కార్యక్రమానికి ఎఐసిసి అధ్యక్షులు ఖర్గేతో పాటు, నేతలు సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకలను ఆయన ఆహ్వానిస్తారని ఆ వర్గాలు తెలిపాయి.

మహిళా అధికారుల పదోన్నతులపై

నాలుగు నెలల్లో విధానం

- సైన్యానికి గడువు నిర్దేశించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : కల్నల్ ర్యాంకు నుండి బ్రిగేడియర్ ర్యాంకు వరకూ మహిళా అధికారుల పదోన్నతులకు సంబంధించిన విధానాన్ని ఖరారు చేసేందుకు సుప్రీంకోర్టు సైన్యానికి నాలుగు నెలల సమయం ఇచ్చింది. ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలో న్యాయమూర్తులు జెబి పార్దివాలా, మనోజ్ మిశ్రాతో కూడిన బెంచ్ అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, సీనియర్ న్యాయవాది ఆర్. బాలసుబ్రమణ్యం వాదనలను నమోదు చేసింది. మహిళా అధికారుల పదోన్నతులపై వచ్చే సంవత్సరం మార్చి 31 నాటికి విధానాన్ని రూపొందించాలని సైన్యానికి ప్రధాన న్యాయమూర్తి సూచించారు. పదోన్నతులలో వివక్ష చూపుతున్నారంటూ కొందరు మహిళా అధికారులు ఆరోపిస్తున్నారు. మహిళా అధికారుల కోసం శాశ్వత కమిషన్‌ను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు 2020 ఫిబ్రవరిలోనే ఆదేశించింది. మహిళలకు శారీరక పరిమితులు ఉన్నాయంటూ కేంద్రం చేసిన వాదనను తోసిపుచ్చింది. ఇది మహిళలపై లింగ వివక్ష



చూపడమే అవుతుందని ఘాటుగా వ్యాఖ్యానించింది.

సంప్రదింపులు కొనసాగుతున్నాయి : సైన్యం

మహిళా అధికారుల పదోన్నతుల విషయంలో సంప్రదింపులు కొనసాగుతున్నాయని సైన్యం కోర్టుకు తెలిపింది. కల్నల్ ర్యాంకు నుండి బ్రిగేడియర్ ర్యాంకుకు పదోన్నతి పొందాలంటే అధికారులు కొన్ని అర్హతలు పొందాల్సి ఉంటుందని అటార్నీ జనరల్ కోర్టు దృష్టికి తెచ్చారు. కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన మహిళా అధికారి తరపున న్యాయవాది అర్చనా పాఠక్ దేవ్ వాదనలు వినిపిస్తూ మహిళా అధికారులు తమకు రావాల్సిన పదోన్నతుల కోసం చాలా కాలంగా న్యాయస్థానాలలో పోరాడుతున్నారని చెప్పారు.

మా సమస్యలు పరిష్కరించండి

- ఉప ముఖ్యమంత్రికి అంగన్‌వాడీల వినతి

ప్రజాశక్తి- సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా)

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల ఎనిమిది నుంచి సమ్మెలోకి వెళ్లనున్నామని, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు మంగళవారం ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరకు వినతిపత్రం అందజేశారు. ఆయనను సాలూరు క్యాంపు కార్యాలయంలో యూనియన్ పట్టణ అధ్యక్షులు బి.రాధ నాయకత్వాన పలువురు కార్యకర్తలు కలిశారు. తాము గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అనేక సేవలు అందిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు. నిత్యావసర సరుకుల ధరలు, డీజిల్, పెట్రోలు, గ్యాస్, ధరలు పెరుగుతున్నా వేతనాలు మాత్రం పెరగలేదన్నారు. కేంద్రాల నిర్వహణ బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు ఎక్కువ వేతనం ఇస్తామని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు



డిప్యూటీ సిఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు

ఇచ్చినప్పటికీ రాష్ట్రంలో అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయడం లేదని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను తమకు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణకు వివిధ రకాల యాప్స్ తెచ్చారని, ఏజెన్సీ మారుమూల ప్రాంతాల్లో సెల్ సిగ్నల్ ఉండడం లేదని, దీనివల్ల అంగన్‌వాడీలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లగా మార్చాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలకు పెంచాలని, రాజకీయ జోక్యం అరికట్టాలని, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్, వివిధ రకాల యాప్‌లను రద్దు చేయాలని కోరారు. రాజన్నదొర స్పందిస్తూ, అంగన్‌వాడీలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యూనియన్ నాయకులు పార్వతి, చిలకమ్మ, జ్యోతి తదితరులు ఉన్నారు.

చంద్రబాబుపై పిటి వారెంట్లను తోసిపుచ్చిన ఎసిబి కోర్టు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో రిమాండ్‌లో వున్నప్పుడు ఫైబర్‌నెట్ కార్పొరేషన్, అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో విచారించాలని సిఐడి దాఖలు చేసిన రెండు పిటి వారెంట్లను ఎసిబి కోర్టు తోసిపుచ్చింది. చంద్రబాబు రెగ్యులర్ బెయిల్‌పై బయట వున్నందున ఈ పిటి వారెంట్లకు విచారణ అర్హత లేదంటూ మంగళవారం విజయవాడలోని ఎసిబి కోర్టు న్యాయమూర్తి కొట్టేశారు. ప్రస్తుతం ఫైబర్‌నెట్ కేసులో చంద్రబాబు బెయిల్ పిటిషన్ సుప్రీంకోర్టులో, అలాగే మద్యం, ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులకు సంబంధించి రాష్ట్ర హైకోర్టులో బెయిల్ అంశంపై విచారణ జరుగుతున్న అంశం తెలిసిందే.

రోజుకు 31 మంది అన్నదాతల ఆత్మహత్య

- 2022లో 11,290 బలవన్మరణం
- వీరిలో 6083 మంది వ్యవసాయ కార్మికులే

• పేజీలో... లోపల •

పంటలకు అపార నష్టం

- నిండా మునిగిన రైతు
- వీరవాసరంలో సుడిగాలి
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పలు జిల్లాల్లో అంధకారం

ప్రజాశక్తి- యంత్రాంగం

మిచౌంగ్ తుపాన్ మంగళవారం మధ్యాహ్నం బాపట్ల-నిజాంపట్నం మధ్య తీరాన్ని దాటింది. తుపాను ప్రభావంతో బాపట్ల సూర్యలంక తీరంలో అలలు పెద్ద ఎత్తున ఎగసిపడ్డాయి. 20 మీటర్ల వరకు సముద్రం ముందుకు వచ్చింది. గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. వర్షాలు కొనసాగుతున్నాయి. తుపాను ప్రభావంతో కొన్ని జిల్లాల్లో కుండపోత వర్షాలు కురిశాయి. లక్షలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. రైతులకు అపార నష్ట వాటిల్లింది. పలు చెరువులకు గండ్లు పడ్డాయి. విద్యుత్తు స్తంభాలు విరిగిపోవడం, పలు వృక్షాలు, చెట్ల కొమ్మలు విద్యుత్ వైరు, స్తంభాలపై పడడంతో విద్యుత్ సరఫరా నిల్చిపోయి అంధకారం అలుముకుంది. పలు జిల్లాల్లో రహదారులు చెరువులను తలపించాయి. ఇంటి నుంచి బయటకు అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. బాపట్ల, ప్రకాశం, పల్నాడు, నెల్లూరు, గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి, తిరుపతి జిల్లాల్లో తుపాను ప్రభావం ఎక్కువగా కనిపించింది. అన్నమయ్య, తూర్పుగోదావరి, విశాఖ జిల్లాల్లోనూ ప్రభావం చూపింది.

బాపట్ల జిల్లాలో కోతకు సిద్ధంగా ఉన్న 1.50 లక్షల ఎకరాల్లోని వరి పైరుకు నీట మునగడం, గాలికి ఒరిగిపోవడం వల్ల తీవ్ర నష్టం వాటిల్లింది. పలు మండలాల్లో మిర్చి, పొగాకు, వేరుశనగ, మినుము మొక్కలు నీటమునిగాయి. మొక్కజొన్నకూ నష్టం వాటిల్లింది. రేపల్లెలో చెరువులకు గండ్లు పడ్డాయి. గడిచిన 24 గంటల్లో కర్లపాలెం మండలంలో అత్యధికంగా 237.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కృష్ణా నదిలో నిలిపి ఉంచిన రాజుకాల్వ, లంకేవానిదిబ్బ గ్రామాలకు చెందిన 40 మత్స్యకారుల బోట్లు మునిగిపోయాయి.

ప్రకాశం జిల్లాలో వాగులు, వంకలు పొంగుతున్నాయి. పొగాకు, వరి, మిర్చి, శనగ, మినప తదితర పంటలు నీటిలో మునిగాయి. గాలులకు విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగి రోడ్లకు అడ్డంగా పడ్డాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

నెల్లూరు నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జిల్లాలో మంగళవారం ఒక్క రోజే 164.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మనుబోలులో 317 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. పెన్నా, కాళంగి, పంబలేరు, పిల్లాపేరు, నదుల్లో నీరు చేరింది. గాంధీబొమ్మ ప్రాంతంలో భారీ చెట్లు విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. 4,500 విద్యుత్ స్తంభాలు, 1,081ట్రాన్స్‌ఫార్మర్‌లు దెబ్బతిన్నాయి. పలు చెరువులకు గండ్లు పడ్డాయి.

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పంటలకు అపార నష్టం వాటిల్లింది. గాలులకు వరి పైరు నేలకొరిగింది. వరి పంట కోసి పనలపై ఉండగా వర్షాలకు నీట మునిగింది. పత్తి, మిర్చి, శనగ, ఆపరాలు పొగాకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒక్క బాపట్ల జిల్లాలోనే లక్ష ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాలను బట్టి తెలుస్తోంది. గుంటూరు జిల్లాపైనా తుపాను తీవ్రత అధికంగా ఉంది.

కృష్ణా జిల్లాలో 417 గ్రామాల్లోని 1,72,550 ఎకరాల్లో వివిధ రకాల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది. అత్యధికంగా 1,68,464.35 ఎకరాల్లో వరి, 2,116.21 ఎకరాల్లో వేరుశనగ, 1,444.67 ఎకరాల్లో మినుము, 525 ఎకరాల్లో పత్తి, 62 ఎకరాల్లో అరటి, 700 ఎకరాల్లోని కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి.

పశ్చిమగోదావరి జిల్లాలో 7,55 ఎకరాల్లో వరి పైరు నేలకొరిగినట్లు, వేలాది ఎకరాల్లో వరి పనలు నీట మునిగినట్లు అధికారుల ప్రాథమిక లెక్కలు చెబుతున్నాయి. కళ్లాల్లోనే ఉన్న సుమారు 31 వేల టన్నుల ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. దీనిలో కొంత ధాన్యం వర్షానికి తడిచిపోయింది. వీరవాసరం మండలంలో సుడిగాలి భీభత్సం సృష్టించింది. కొబ్బరి చెట్లు సైతం విరిగిపడ్డాయి, ట్రాక్టర్, మినీ వ్యాన్‌లు బోల్తా పడ్డాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, రేకుల షెడ్లు విరిగి రోడ్డుకడ్డంగా పడ్డాయి. కెపి రైసు మిల్లుకు చెందిన ధాన్యం ఆరబెట్టు డ్రయర్ ధ్వంసమైంది. సుడిగాలిలో చిక్కుకొన్న ముగ్గురు గాయపడ్డారు.

ఏలూరు జిల్లాలో గడిచిన 24 గంటల్లో 37.9 మిల్లీమీటర్ల సగటు వర్షం నమోదైంది. ముదినేపల్లిలో అత్యధికంగా 135.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. కోత కోసిన వరి పనలు నీటిలో తేలియాడాయి. రోడ్లపైనా, కళ్లాలోని ధాన్యపు రాశులు తడిసిముద్దయ్యాయి. వేరుశనగ పంటకూ తీవ్ర నష్టం వాటిల్లింది. నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు మండలాల్లో రబీ నారు మడుల్లోకి మోకాళ్ల లోతు నీరు చేరింది. మినుము, పత్తి, మొక్కజొన్న, పొగాకు, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి.

కాకినాడ జిల్లాలో మూడు వేల ఎకరాల్లో, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 1,500 ఎకరాల్లో, తూర్పుగోదావరి జిల్లాలో 4 వేల ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. 19 వేల క్వింటాళ్ల ధాన్యం తడిసిపోయింది.

అన్నమయ్య జిల్లాలో 4,152 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. వరి, అరటి, మిరప, చెరుకు, టమోటా, బొప్పాయి నష్టం వాటిల్లింది. 1,954 మంది రైతులకు నష్టపోయారు. తిరుపతి జిల్లాలో 405 ఎకరాల్లో వరి నాట్లు నీట మునిగినట్లు వ్యవసాయ శాఖాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. గత రెండు రోజుల్లో తిరుపతిలో 24 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. తిరుమలలోని జలశయాల్లో పుష్కలంగా నీరు చేరింది. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో వరి పంటకు వాటిల్లింది.


బాపట్ల జిల్లాలో తీరం దాటే సమయంలో సూర్యలంక తీరం..

తుపాను ప్రాంతాల్లో నేడు సిపిఎం బృందాల పర్యటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'మిచౌంగ్' తుపాను ధాటికి దెబ్బతిన్న ప్రాంతాల్లో సిపిఎం బృందాలు నేడు (బుధవారం) పర్యటించనున్నాయి. బాపట్ల, నెల్లూరు, కృష్ణా జిల్లాల్లో మూడు వేర్వేరు బృందాలు పర్యటిస్తాయని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తుపాను దెబ్బకు రాష్ట్రం అతలాకుతలమైందని, లోతట్టు ప్రాంతాలు మునిగి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. సహాయక శిబిరాలు ప్రభుత్వం ఏర్పాటు చేసినప్ప టికీ అరకొర సౌకర్యాలే ఉన్నాయని, వరిపంట నీటిలో మునిగిందని, ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నా తేమ పేరుతో కొనుగోళ్లు జరగక కళ్లాల్లోనే ధాన్యం ఉండిపోయిందని వివరించారు. వరిపంట గాలికి పూర్తిగా నేలకొరిగిందని, మరో రోజు ఇలానే వర్షం కొనసాగి, గాలొస్తే అరటి, మిర్చి, ప్రత్తి పంట పూర్తిగా దెబ్బతిని చేతికి రాకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పుచేసి పెట్టుబడి పెట్టిన కౌలురైతులు మరింత నష్టపోతారని, ఈ నేపథ్యంలో సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తుపాను ప్రభావిత వరద ప్రాంతాల్లో నాయకులు పర్యటించనున్నారని తెలిపారు.

బాపట్ల జిల్లాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి, రాష్ట్ర కమిటీ సభ్యులు కె ధనలక్ష్మి బృందం పర్యటించనుంది. కృష్ణా జిల్లాలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వి కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి వై నరసింహారావు, కౌలురైతు సంఘం కార్యదర్శి ఎం హరిబాబుతో కూడిన బృందం పర్యటించనుంది. నెల్లూరు జిల్లాలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు కె ఉమామహేశ్వరరావులతో కూడిన బృందం పర్యటించనుంది.

పలు విమాన సర్వీసులు రద్దు

ప్రజాశక్తి - గన్నవరం, విశాఖ : తుపాను కారణంగా పలు విమాన సర్వీసులు మంగళవారం రద్దయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి గన్నవరం విమానాశ్రయానికి రావాల్సిన 24 విమాన సర్వీసులు రద్దయ్యాయి. రన్‌వేపై విమానాలు దిగేందేకు అనుకూల వాతావరణం లేకపోవడంతో హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు, విశాఖ ప్రాంతాల నుంచి రావాల్సిన విమాన సర్వీసులను నిలిపివేశారు. సోమవారం 20 సర్వీసులను రద్దు చేసినట్లు తెలిపారు. విశాఖ నుంచి దేశీయంగా రాకపోకలు సాగించే 23 ఇండిగో విమాన సర్వీసులూ రద్దయ్యాయి.

ఎన్‌టిఆర్ ట్రస్టు ద్వారా సాయం : భువనేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తుపాను కలిగించిన నష్టం ఆవేదన కలిగిస్తోందని ఎన్‌టిఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. చేతికొచ్చిన పంట నీటి పాలైన రైతన్నల బాధ వర్ణణాతీతమన్నారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా స్పందించారు. ఎన్‌టిఆర్ ట్రస్టు ద్వారా ఆపన్నులకు సాయం చేస్తామని తెలిపారు. అవకాశం ఉన్న ప్రతిఒక్కరూ బాధల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడానికి ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

కార్యకర్తలు అండగా నిలవాలి

పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

మిచౌంగ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు సహాయక కార్యక్రమాల్లో పాల్గొనాలని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆదేశించారు. ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా, ఉభయగోదావరి, విశాఖ జిల్లాల్లో తుపాను తీవ్రత ఉన్న నేపథ్యంలో మంగళవారం బాధిత జిల్లాల డిసిసి అధ్యక్షులతో రుద్రరాజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం తక్షణ నష్టపరిహారం అందించాలని కోరారు.


గుంటూరు జిల్లా సూర్యలంక తీరంలో మత్స్యకారుల ఏర్పాటు చేసిన పునరావాస శిబిరం


కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం గండిగుంటలో నీటిపాలైన వరి పంట


గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నంబూరులో నీటమునిగిన వరి పొలం


కృష్ణాజిల్లా మచిలీపట్నంలో కూలిపోయిన ఇల్లు

సర్జన్ స్పెషలిస్ట్ పోస్టుల భర్తీకి చర్యలు

- ఎం శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్యారోగ్యశాఖలో 150 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి ఈ నెల 11, 13, 15 తేదీల్లో వాకిన్ రిక్రూట్‌మెంట్ చేపట్టనున్నట్లు ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మెంబర్ సెక్రటరీ ఎం శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్‌లో రెగ్యులర్, కాంట్రాక్ట్ విధానంలో పోస్టులు భర్తీ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల 11న జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, డెర్మటాలజీ, ఫోరెన్సిక్ సైన్స్ ఈ నెల 13న గైనకాలజీ, అనస్తీషియా, ఇఎన్‌టి, పెథాలజీ, 15న పీడియాట్రిక్స్, ఆర్థోపిడిక్స్, సైకియాట్రీ రిక్రూట్‌మెంట్ ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తాడేపల్లిలోని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.


నెల్లూరులో వాలిపోయిన విద్యుత్‌స్తంభం

ముంచిన మిచౌంగ్

(మొదటి పేజీ తరువాయి)

కసరత్తు ప్రారంభించింది. రాష్ట్ర వ్యాప్తంగా 211 పునరావాస కేంద్రాలకు 15173 మందిని తరలించారు. ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. 18973 ఆహార ప్యాకెట్లు సరఫరా చేశారు. 80 చోట్ల వైద్య శిబిరాలు పెట్టారు. ముందు జాగ్రత్త చర్యగా నెల్లూరులో నాలుగు, బాపట్లలో మూడు, కృష్ణాలో రెండు, తిరుపతి, ప్రకాశంలో ఒక్కో బృందాలతోపాటు మొత్తం ఆరు ఎన్‌డిఆర్‌ఎఫ్, ఆరు ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలను ఏర్పాటు చేశారు.

తిరుపతిలో అత్యధిక వర్షపాతం

సోమవారం ఉదయం 8.30 గంటల నుండి మంగళవారం ఉదయం 8.30 గంటల వరకూ తిరుపతి జిల్లా కోటలో 38.8 సెంటీమీటర్లు, నెల్లూరు జిల్లా మనుబోలులో 36.6 సెంటీమీటర్లు, తిరుపతి జిల్లా చిల్లకూరులో 33.5, నాయుడుపేటలో 27.1, బలయపల్లిలో 23.9, నెల్లూరు జిల్లా సైదాపురంలో 22.3, వెంకటాచలంలో 21.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణశాఖ తెలిపింది. మంళవారం ఉదయం 8.30 గంటల నుండి సాయంత్రం ఆరుగంటల వరకు ఏలూరు జిల్లా తాడ్వాయిలో 14.8, బాపట్ల జిల్లా గురిజేపల్లిలో 14.5, అనకాపల్లి జిల్లా దార్లపూడిలో 13.6, కొత్తకోటలో 13, బలిగట్టంలో 12.6, బాపట్ల జిల్లా అప్పికట్లలో 12.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

స్తంభించిన రవాణా

- 3 వేలు ఆర్‌టిసి సర్వీసులు, 305 రైళ్లు రద్దు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మిచౌంగ్ తుపానుతో రవాణా స్తంభించింది. ఏడు జిల్లాల పరిధిలో రోడ్లు దెబ్బతిన్నాయి. నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో పలుచోట్ల జాతీయ రహదారి కూడా ధ్వంసమైంది. దీంతో రోడ్డు, రైల్వే రవాణాతోపాటు పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. తీర ఓడరేవుల్లో సరుకు రవాణా ఓడలను నిలిపేశారు. తీరం వెంబడి చెన్నై నుండి కోల్‌కతాకు వెళ్లే 16వ నెంబర్ జాతీయ రహదారి మొత్తం స్తంభించిపోయింది. సూళ్లూరుపేట, కావలి, టంగుటూరు దగ్గర జాతీయ రహదారిపై నాలుగు అడుగులకు పైగా నీరు చేరడంతో ఎక్కడి వాహనాలను అక్కడే నిలిపేశారు. శ్రీకాళహస్తి మండలం ఏర్పేడు మండలంలో రోడ్లన్నీ దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. అలాగే నెల్లూరు జిల్లాలోని పలురోడ్లు జలమయమయ్యాయి. ప్రకాశం జిల్లా కొండేపి, పర్చూరు మధ్య రోడ్డు దెబ్బతినడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. కాకినాడ జిల్లా జగ్గంపేట వద్ద జాతీయ రహదారిపైకి వరద రావడంతో రాకపోకలను ఆపేశారు. పలుచోట్ల రోడ్లు కోతకు గురవడంతో ఎపిఎస్‌ఆర్‌టిసి సర్వీసులు నిలిపేసింది. రాష్ట్రం నుండి చెన్నై వైపు వెళ్లే ఆర్‌టిసి బస్సులన్నింటినీ రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 3 మూడు వేల ఆర్‌టిసి సర్వీసులను రద్దు చేశారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 305 రైళ్లు రద్దు చేశారు. విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, తిరుపతి నుండి నడిపే విమాన సర్వీసులను ఈ వర్షాలకు రద్దు చేశారు. తిరుమల ఘాట్ రోడ్లపై భారీ వృక్షాలు కూలి రవాణాకు తీవ్ర అంతరాయం కలిగింది. విజయవాడ ఇంద్రకీలాద్రి ఘాట్‌రోడ్‌పై రాళ్లు పడతాయని ముందస్తు చర్యల కింద రోడ్డును అధికారులు మూసివేశారు. కాకినాడ నుండి ఉప్పాడకు వెళ్లే బీచ్ రోడ్డు దెబ్బతినడంతో వాహనాలను నిలిపేశారు. తుపాను ప్రభావంతో రోడ్లకు జరిగిన నష్టంపై అంచనా వేస్తామని అధికారులు తెలిపారు.



నెల్లూరులో వరద నీటిలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు


కెకె.లైన్‌లో పట్టాలు తప్పిన రైలు

కెకె.లైన్‌లో విరిగిపడ్డ కొండచరియలు

ప్రజాశక్తి - విశాఖపట్నం

అల్లూరి జిల్లా అనంతగిరి మండలం కొత్తవలస, కిరండోల్ రైల్వే లైన్‌లో శివలింగాపురం స్టేషన్, యార్డ్-1 సమీపంలో మంగళవారం ఐరన్ ఓర్‌తో రన్నింగ్‌లో ఉన్న గూడ్స్ రైలుపై కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో, ఒక బోగీ పట్టాలు తప్పింది. సిబ్బంది గమనించి ట్రైన్ పైలెట్‌ను అప్రమత్తం చేయడంతో పెద్ద ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఆ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

కోర్టు ప్రాంగణంలో ఎస్‌ఐ అభ్యర్థుల ఎత్తు కొలతలు

- ముగ్గురు అనర్హులని తేలడంతో గత ధ్రువపత్రాలపై విచారణకు ఆదేశం
- తదుపరి విచారణ 13కు వాయిదా
- ఎస్‌ఐ ఫలితాలు నిలుపుదల చేస్తూ గతంలోని స్టే ఉత్తర్వులు రద్దు

ప్రజాశక్తి-అమరావతి

హైకోర్టును ఆశ్రయించిన ఎస్‌ఐ అభ్యర్థుల ఎత్తు కొలత ప్రక్రియ కొత్త మలుపు తిరిగింది. న్యాయమూర్తుల సమక్షంలో అభ్యర్థుల కొలత ప్రక్రియ జరిగింది. ముగ్గురు అభ్యర్థులు అనర్హులని తేలింది. దీంతో గతంలో వారు అర్హులంటూ అధికారులు ధ్రువపత్రాలు ఇచ్చిన వ్యవహారంపై విచారణ చేయాలని గుంటూరు ఐజిని ఆదేశించింది. విచారణను ఈ నెల 13కు వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ జి నరేందర్, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణకు పిటిషనర్లు 19 మంది హాజరు కావాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఎస్‌ఐ ఫలితాల నిలుపుదల చేస్తూ గతంలోని స్టే ఉత్తర్వులను రద్దు చేసింది. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఎత్తుల కొలతలకు తమ పర్యవేక్షణలో వైద్యులు నిర్వహించిన కొలతకు తేడా లేదని స్పష్టం చేసింది. ముగ్గురు అభ్యర్థులు అనర్హులని తేలడంతో స్పందించిన హైకోర్టు.. తాము విధించిన షరతు ప్రకారం రూ.లక్ష చొప్పున చెల్లిస్తారా? లేక జైలుకు వెళతారా? అని ప్రశ్నించింది. 2018 నోటిఫికేషన్ సమయంలో నిర్వహించిన పరీక్షలో ఎత్తు కొలతల్లో పిటిషనర్లు అర్హత సాధించారని న్యాయవాది జాడ శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు. ముగ్గురి కొలతలతో ప్రక్రియను నిలిపివేయవద్దని కోరడంపై హైకోర్టు ఘాటుగా స్పందించింది. కోర్టు సమయాన్ని వృథా చేశారని పేర్కొంటూ విచారణను ఈ నెల 13కు వాయిదా వేసింది.

ఏనుగుల దాడిలో పశువుల కాపరి మృతి

ప్రజాశక్తి- పులిచెర్ల (చిత్తూరు జిల్లా):

ఏనుగుల దాడిలో పశువుల కాపరి మృతి చెందిన ఘటన చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం ఎర్రపాపిరెడ్డిగారిపల్లి పంచాయతీ గేటుకాడ బెస్తపల్లి సమీపంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవిప్రకాష్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రపాపిరెడ్డిగారిపల్లికి చెందిన మస్తాన్(35) పశువులను మేపుకునేందుకు గ్రామానికి సమీపంలో ఉన్న కృష్ణమ్మ చెరువు వద్దకు వెళ్లాడు. అక్కడే సంచరిస్తున్న ఎనిమిది ఏనుగుల గుంపు ఒక్కసారిగా మస్తాన్‌పై దాడి చేయడంతో మస్తాన్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గుర్తించి కల్లూరు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ రవిప్రకాష్ రెడ్డి మస్తాన్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


ఏనుగుల దాడిలో మృతి చెందిన మస్తాన్

రాయలసీమ 'వర్సిటీ' విసి, రిజిస్ట్రార్లకు నాన్ బెయిలబుల్ వారెంట్లు

ప్రజాశక్తి-అమరావతి

వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావాలన్న ఉత్తర్వులు అమలు చేయకపోవడంతో రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఎ ఆనందరావు, రిజిస్ట్రార్ బైనేని శ్రీనివాసులుకు హైకోర్టు మంగళవారం నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేసింది. ఈ మేరకు జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఎంఇడి కళాశాల గుర్తింపు కల్పించాలంటూ పలు కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్ విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాలని గతంలో వారిద్దరికీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను అమలు చేయకపోవడంతో ఆ కాలేజీలు కోర్టు ధిక్కార పిటిషన్లు దాఖలు చేశాయి. విసి ప్రొఫెసర్ ఎ ఆనందరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బైనేని శ్రీనివాసులను వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా ఉన్నారు. వారికి హైకోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేసి విచారణను వాయిదా వేసింది.

యుటిఎఫ్ పదో తరగతి మోడల్ పేపర్ విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

యుటిఎఫ్ ప్రచురించిన పదో తరగతి పరీక్ష మోడల్ పేపర్‌ను మంగళవారం విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్ ఆవిష్కరించారు. 2024 మార్చిలో జరగబోయే పరీక్షలకు సంబంధించి యుటిఎఫ్ ప్రచురణల విభాగం మోడల్ పేపర్స్‌తో పుస్తకాన్ని ప్రచురించింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నక్కా వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాదు మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని అతి తక్కువ రేటుతో పుస్తకాలను ముద్రిస్తున్నామని పేర్కొన్నారు. వీటిని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆదరించాలని కోరారు. వెనుకబడిన విద్యార్థులు కనీస మార్కులు సాధించేందుకు ఈ పేపర్లు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా విద్యార్థుల అభివృద్ధే ధ్యేయంగా తాము ఈ కార్యక్రమం చేపడుతున్నామని వివరించారు. ఈ ఏడాది ప్రతి సబ్జెక్టుకూ నాలుగు మోడల్ పేపర్లు ఉంటాయని, తెలుగు, ఇంగ్లీసు మీడియంలో వాటిని ముద్రించామని పేర్కొన్నారు. ఈ పుస్తకాలు కావాల్సిన వారు యుటిఎఫ్ బాధ్యులను సంప్రదించాలని కోరారు. ఈ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, రాష్ట్ర పరీక్షల విభాగం డైరెక్టరు దేవానందరెడ్డి, ప్రచురణ విభాగం కమిటీ ఛైర్మన్ ఎం హనుమంతరావు, ఐక్య ఉపాధ్యాయ పత్రిక సంపాదకులు ఎన్ కుమార్‌రాజా, ఆడిట్ కమిటీ కన్వీనర్ టిఎన్ మల్లేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి మనోహర్‌కుమార్, ప్రచురణ కమిటీ సభ్యులు రాజశేఖర్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

మిజోరం ముఖ్యమంత్రిగా 8న లాల్దుహోమా ప్రమాణం

ఐజ్వాల్ : మిజోరం పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పిఎం) అధ్యక్షుడు లాల్దుహోమా మిజోరం ముఖ్యమంత్రిగా ఈనెల 8న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రమాణస్వీకారం అనంతరం రానున్న 100 రోజులకు సంబంధించి ప్రాధాన్య ప్రాజెక్టులను ప్రకటిస్తామని లాల్దుహోమా తెలిపారు. ఈ రోజు సాయంత్రం 8 గంటలకు గెలుపొందిన ఎమ్మెల్యేలతో తమ నివాసంలో సమావేశం కానున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ఆర్థికపరిస్థితి చాలా దారుణంగా ఉందని అన్నారు.

లఖ్బీర్ సింగ్ సన్నిహితుడు పరంజిత్ అరెస్టు

ఛండీగఢ్ : పాకిస్థాన్ కేంద్రంగా కార్యాకలాపాలు నిర్వహిస్తున్న ఖలీస్థాన్ ఉగ్రవాది లఖ్బీర్ సింగ్ రోడ్ సన్నిహితుడు పరంజిత్ సింగ్ అలియాస్ పంజాబ్ సింగ్ అలియాస్ ధాదిని అరెస్టు చేసినట్లు పంజాబ్ పోలీసులు బుధవారం తెలిపారు. అమృత్‌సర్‌లోని ఎస్‌జిఆర్‌డి విమానశ్రయంలో ఉగ్రవాద నియామకాలు, ఆర్థిక ఇతర సహాయ సమీకరణకు పరంజిత్ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం అందడంతో స్టేట్ స్పెషల్ ఆపరేషన్ సెల్ (అమృత్‌సర్) బృందం అదుపులోకి తీసుకున్నట్లు డిజిపి గౌరవ్ యాదవ్ తెలిపారు. బ్రిటీష్ పౌరసత్వం కలిగియున్న పరంజిత్ అంతర్జాతీయ సిక్కు యువజన సమాఖ్య (ఐఎస్‌వైఎఫ్) వ్యవస్థాపక సభ్యుడు. 1990 తొలినాళ్లలో పంజాబ్‌లో చోటుచేసుకున్న పలు ఉగ్రవాద కార్యకలాపాల్లో పరంజిత్‌కు ప్రమేయముంది. 2003లో అరెస్టు కాగా పలు ఉగ్రవాద నేరాలకు శిక్ష కూడా ఎదుర్కొన్నాడు. శిక్షాకాలం ముగిసిన తర్వాత బ్రిటన్ వెళ్లిపోయారు. ఆ తర్వాత కూడా ఐఎస్‌వైఎఫ్ కోసం బ్రిటన్‌లోనూ, యూరప్ దేశాల్లోనూ నిధులు సమీకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయనను అరెస్టు చేశారు.

జైపూర్‌లో రాజ్‌పుత్ నేత దారుణ హత్య

జైపుర్: రాజ్‌పుత్ నాయకులు, రాష్ట్రీయ రాజ్‌పుత్ కర్ణిసేన అధ్యక్షులు సుఖ్‌దేవ్ సింగ్ గోగామేడీ హత్యకు గురయ్యారు. గుర్తుతెలియని దుండగులు మంగళవారం ఆయన్ను ఇంట్లోనే కాల్చిచంపారు. జైపుర్‌లో శ్యామ్‌నగర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ హత్యకు సంబంధించిన సిసిటివి ఫుటేజీ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియోలో దుండగులు అతి సమీపం నుంచి ఆయన్ను కాల్చినట్లు కనిపిస్తోంది. సుఖ్‌దేవ్‌ను కలవాలంటూ నలుగురు వ్యక్తులు మంగళవారం ఆయన ఉన్న ఇంట్లోకి చేరుకుని..కాసేపు మాట్లాడిన తరువాత ఆయనపై కాల్పులు జరిపినట్లు డిజిపి ఉమేశ్ మిశ్రా తెలిపారు. దీంతో సుఖ్‌దేవ్ అక్కడికక్కడే మృతి చెందారన్నారు. ఆయనతో పాటు భద్రత సిబ్బందిలో ఒకరు గాయపడ్డారని డిజిపి వెల్లడించారు.



బాపట్ల పట్టణం చీలు రోడ్ సెంటర్లో కూలిన కోదండరామస్వామి దేవాలయం ప్రహరీ గోడ



తూర్పుగోదావరి జిల్లా గోకవరంలో వర్షపు నీటి నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతుల పాట్లు



విజయవాడ భానునగర్‌లో దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు తదితరులు



కోతకు గురైన విశాఖలోని ఆర్‌కె బీచ్ ప్రాంతం

నిరాశ్రయులను ఆదుకోవాలి

- నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి
- ముంపు ప్రాంతాల్లో సిపిఎం నాయకులు పర్యటన

ప్రజాశక్తి - యంత్రాంగం

తుపాను కారణంగా నీట మునిగిన పలు నగరాల్లోని కాలనీల్లో సిపిఎం నాయకులు సోమవారం పర్యటించారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో బాధితులకు భోజన సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు. బియ్యం, నిత్యావసర వస్తువులు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

విజయవాడ నగరంలోని 62, 63, 64 డివిజన్లలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పర్యటించారు. నీట మునిగిన, దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పల్లపు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి నీరు చేరిందన్నారు. నిరాశ్రయులైన పేదలకు బియ్యం, నిత్యావసర వస్తువులు అందించి అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం నిర్మించిన వివిధ కాలనీల్లో స్లాబులు కారిపోతూ, కూలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణంలో 12వ వార్డు వైఎస్ఆర్ కాలనీలో మోకాల్లోతు నీరు చేరిన ప్రాంతాలను సిపిఎం నేతలు పరిశీలించి సమస్యను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాకినాడ నగరంలో రామకృష్ణారావు పేట, కామేశ్వరినగర్, డైరీ ఫారం, సంజయ్‌నగర్, పర్లోవపేట, సూర్యనారాయణపురం, ఏటిమొగ, గోళీలపేట, జె.రామారావుపేట, మహాలక్ష్మి నగర్, ముత్తానగర్, జగన్నాథపురం, రెల్లివీధి, అన్నమ్మ ట్యాంక్ తదితర ప్రాంతాల్లో సిపిఎం నాయకులు పర్యటించారు. సముద్ర పాయలను కలిపే మెయిన్ డ్రెయిన్లలో పూడిక తీస్తే ముంపు నివారణ జరిగే అవకాశం ఉందన్నారు. వర్షాల వల్ల పనులు కోల్పోయిన కార్మికులను ఆదుకోవాలని కోరారు. తిరుపతి ఉప్పంగి హరిజనవాడలో సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, నాయకులు వేణు పర్యటించారు. 70 ఇళ్లల్లోకి నీరు రావడంతో రాత్రంతా వారు జాగారం చేశారని, కనీసం తాగడానికి మంచి నీరు కూడా లేవని తెలిపారు. బిటిఆర్ కాలనీలో ఒడిశా ప్రాంతం నుంచి వలసొచ్చిన 200 మంది కార్మికులు కూలి పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి ఒక్కరికీ పది కేజీల బియ్యం, 14 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.



కాకినాడ జె.రామారావు పేటలో ముంపును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- తడిచిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలి
- పంటలను, ధాన్యం రాశులను పరిశీలించిన సిపిఎం నాయకులు



గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజలో నీటమునిగిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - యంత్రాంగం

మిచౌంగ్ తుపాన్ బీభత్సం వల్ల పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. తడిచిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, టార్పాలిన్లను సరఫరా చేయాలని కోరారు. పట పంట మునిగిన పొలాలను, తడిచిన ధాన్యం రాశులను సోమవారం నాయకులు పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల, పెదకాకాని, మంగళగిరి మండలాల్లో దెబ్బతిన్న పొలాలను సిపిఎం బృందం పరిశీలించి, రైతులతో మాట్లాడింది. ఎకరాకు రూ. 30 నుండి 35వేలు ఖర్చు చేశామని, పంట చేతికి వచ్చే సమయంలో తుపాను వల్ల పంట మొత్తం నాశనమైందని పలువురు రైతులు వాపోయారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే రైతు భరోసా కేంద్రాల ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, తేమ శాతం పరిగణలోకి తీసుకోకుండా కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, నాయకులు కాకుమాను నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. తాడేపల్లి మండలం చిర్రావూరు, గుండిమెడ, తెనాలి మండలంలో రైతు సంఘం నాయకులు పర్యటించారు.

పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం బ్రాహ్మణచెరువులో రైతుల వద్ద ఉన్న ధాన్యపు రాశులను సిపిఎం నేతలు పరిశీలించి రైతుల అవస్థలు అడిగి తెలుసుకున్నారు. పెనుమంట్ర, పెనుగొండ, పోడూరు, ఆచంట, యలమంచిలి మండలాల్లో ఎపి కౌలురైతు సంఘం నేతలు పర్యటించారు. తేమ శాతంతో సంబంధం లేకుండా తడిసిన ధాన్యం కొనుగోలు చేసి బాయిల్డ్ మిల్లులకు తరలించాలని, టార్పాలిన్లను సరఫరా చేయాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు.

పంట నష్టపోయిన కౌలురైతులకు ఎకరాకు రూ.30వేలు నష్టపరిహారం ప్రకటించాలని కోరారు. ఏలూరు జిల్లా దెందులూరు మండలంలోని కొవ్వలి, దోసపాడు గ్రామాల్లో సిపిఎం, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పర్యటించారు. కళ్లాలోని ధాన్యాన్ని, నేల వాలిన వరి పంటలను పరిశీలించారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు. అనకాపల్లి మండలం తుమ్మపాల ప్రాంతంలో ముంపునకు గురైన వరి పంటలను సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం నేతృత్వంలో పార్టీ బృందం పరిశీలించింది. నష్టపోయిన పంటలకు పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేసింది. అచ్యుతాపురం, మునగపాక మండలాల్లో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు ఆధ్వర్యంలో పంటలను పరిశీలించారు.

కప్పుకునేందుకు దుప్పట్లు లేవు

- చలిని తట్టుకోలేక ఇంటికి వెళ్లిపోతున్న నిర్వాసితులు
- బోసిపోయిన పునరావాస కేంద్రం

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి(కాకినాడ జిల్లా)

పునరావాస కేంద్రంలో నిర్వాసితులకు దుప్పట్లను కూడా ప్రభుత్వం పంపిణీ చేయడం లేదు. చలికి తట్టుకోలేక గజగజ వణుకుతూ ఆ కేంద్రంలో ఉండలేక నిర్వాసితులు ఇంటికి తిరుగుముఖం పట్టారు. అల్పాహారం, భోజనంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్నా...నిర్వాసితులు లేక పునరావాస కేంద్రాలు బోసిపోయాయి.

తుపాను నేపథ్యంలో కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం సూరాడు పేటలోని పాఠశాలలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సూరాడిపేట, మాయాపట్నం, గగోలిపేట, గాంధీనగర్ తదితర తీర ప్రాంత మత్స్యకారులను ఈ కేంద్రానికి తరలించాల్సి ఉంది. పునరావాస కేంద్రానికి 400 మందిని తరలించామని అధికారులు చెబుతున్నారు. కాని మంగళవారం సాయంత్రానికి అక్కడ 50 మంది కూడా లేరు. దుప్పట్లను ఇవ్వకపోవడంతో చలితీవ్రతను తట్టుకోలేక వారు ఇళ్లకు వెళ్లిపోయినట్టు చెబుతున్నారు. అల్పాహారం, భోజనం సమయంలో మాత్రమే నిర్వాసితులు వచ్చి వెళ్లిపోతున్నారు.



సూరాడు పేట పునరావాస కేంద్రంలో ఉన్న నిర్వాసితులు

చలిని తట్టుకోలేక ఇంటికి వెళ్లి పోతున్నాం

పునరావాస కేంద్రంలో భోజన సౌకర్యాలు మాత్రమే కల్పించారు. కప్పుకునేందుకు దుప్పట్లను ఇవ్వలేదు. చలిని తట్టుకోలేక ఇంటికి వెళ్లిపోతున్నాం. అధికారులు దుప్పట్లను అందించి ఉంటే పునరావాస కేంద్రంలోనే ఉండేవాళ్లం

- దోనె పేతురు, సూరాడుపేట, నిర్వాసితుడు

విద్యుత్ పునరుద్ధరణకు ప్రత్యేక టీములు

- ఎపిఎస్‌పిడిసిఎల్ పరిధిలో రూ.13 కోట్లు నష్టం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ, అమరావతి బ్యూరో

నెల్లూరు, గుంటూరు, ప్రకాశం, కృష్ణా, చిత్తూరు, కర్నూలు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో నష్టాలను పూడ్చేందుకు ప్రత్యేక టీమ్‌లను నియమించామని ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. ఎపి ట్రాన్స్‌కో, డిస్కామ్స్, ఎపిజెన్‌కో, ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డిలతో సమీక్ష నిర్వహించామని తెలిపారు. కృష్ణపట్నం యూనిట్లు 2, 3 విద్యుత్ సమస్యతోపాటు బొగ్గు ఫీడింగ్ సమస్యతో ట్రిప్ అయ్యాయన్నారు. 132కెవి లైన్లు ఎస్ఎస్‌కి కనెక్ట్ చేశామన్నారు. నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాల్లోని ఆరు పట్టణాలకు, 1119 గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని ఎపిఎస్‌పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు తెలిపారు. సంస్థకు సుమారు రూ.13 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. మంగళవారం సాయంత్రానికి 1.81 లక్షల విద్యుత్ సర్వీసులు, 5425 వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు సరఫరాను పునరుద్ధరించామన్నారు. మిగిలిన సర్వీసులకు బుధవారం సాయంత్రానికి పునరుద్ధరిస్తామన్నారు.

రాష్ట్ర కార్యక్రమంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఆంధ్ర రాష్ట్రం కోసం అశువులుబాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహించాలని ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది. ఈ నెల 15న రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని స్పష్టం చేసింది. దీనికి సంబంధించిన వ్యయాన్ని అన్ని శాఖలూ తమకు కేటాయించిన బడ్జెట్ నిధుల నుంచే భరించాలని నిర్దేశించింది.

'నారాయణ'లో విద్యార్థిపై దాష్టీకం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతి రూరల్ కాలూరు క్రాస్ సమీపంలోని నారాయణ స్కూలులోని ఓ విద్యార్థిపై పాఠశాల యాజమాన్యం దాష్టీకం ప్రదర్శించి చితకబాదింది. విద్యార్థి తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు... పాఠశాల యాజమాన్యం రెండో తేదీ అర్ధరాత్రి ఆరో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి తల్లిదండ్రులకు ఫోన్ చేసి 'మీ కుమారుని ఇంటికి తీసుకెళ్లండి' అంటూ సమాచారం ఇచ్చారు. మూడు తేదీ ఆదివారం తల్లిదండ్రులు కుమారుని దగ్గరకు వచ్చి చూడగా ఆ విద్యార్థి ఒంటిపై గాయాలున్నాయి. ఏమైందని అడుగగా తోటి విద్యార్థుల నగదు దొంగిలించినట్లు ఆరోపించి ఉపాధ్యాయులతో పాటు, వార్డెన్లు సైతం చితకబాదారని తెలిసింది. తల్లిదండ్రులు ఆ విద్యార్థిని రుయా ఆస్పత్రికి వైద్యనిమిత్తం తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు బాలుడికి ఇన్‌పేషంట్‌గా వైద్యసేవలు అందిస్తున్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ ఎస్ఐ నాగేంద్రబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్‌పై బిజెపి పిచ్చి ప్రశ్నలు మానుకోవాలి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై పార్లమెంటులో బిజెపి పిచ్చి ప్రశ్నలు వేయడం మానుకోవాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మంగళవారం ఒక ప్రకటనలో హితవు పలికారు. సోమవారం రాజ్యసభలో బిజెపి ఎంపి జివిఎల్ నరసింహారావు విశాఖ స్టీల్‌ప్లాంట్ నష్టాలపై వివరణ అడిగారని, దానికి కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగన్‌సింగ్ కులస్తే స్పందిస్తూ ప్లాంట్‌కు భారీగా నష్టాలు వస్తున్నాయని వివరించారన్నారు. ఆ సమయంలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు ఎందుకివ్వరని నరసింహారావు కేంద్రాన్ని ప్రశ్నించలేదన్నారు. నష్టాలెందుకొస్తున్నాయన్న విషయంపై ఎటువంటి ఆరా తీయలేదని, విశాఖ స్టీల్‌ప్లాంట్ నష్టాల్లో ఉందని చెబుతూ పోస్కో, జిందాల్ కంపెనీలకు అమ్మేయాలనే విధానాన్ని ప్రచారం చేసుకోవడానికే పార్లమెంట్‌ను బిజెపి వేదికగా వాడుకుంటోందని విమర్శించారు. పిచ్చి ప్రశ్నలు వేసి ప్రజలకు విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌పై తప్పుడు అభిప్రాయాన్ని కల్పించాలని బిజెపి ప్రభుత్వం చాలా కాలంగా ఆరాటపడుతోందని అన్నారు. ఈ దుర్మార్గమైన కుట్రను ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం యావత్తు ఖండించాలని సిఐటియు రాష్ట్ర కమిటీ కోరుతోందన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు గుండెకాయలాంటి బ్లాస్ట్‌ఫర్నేస్ 3ను 2022 జనవరి 27 నుండి నిలుపుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు. 22 నెలలకుపైగా అధునాతనమైన బ్లాస్ట్‌ఫర్నేస్‌ను నిలుపుదల చేయడం వల్ల మిగిలిన ఉత్పత్తి విభాగాలలోనూ ఉత్పత్తి తగ్గించుకోవాల్సి వచ్చిందన్నారు. అందువల్లే దేశంలో ఇతర పబ్లిక్, ప్రయివేట్ స్టీల్‌ప్లాంట్లు అన్నీ లాభాల్లో ఉండగా విశాఖ స్టీల్‌ప్లాంట్ ఒక్కటే నష్టాల్లోకి నెట్టబడిందని పేర్కొన్నారు. దేశంలో ఇతర స్టీల్‌ప్లాంట్లు అన్నింటికీ సొంతగనులున్నాయని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించి 35 ఏళ్లు గడిచినా కేంద్ర ప్రభుత్వాలు సొంతగనులు ఇవ్వలేదని గుర్తు చేశారు. నాటి నుంచి ఇనుప ఖనిజాన్ని బయట మార్కెట్‌లో కొనాల్సి వస్తుండటంతో ప్లాంట్‌పై అదనపు భారం పడుతోందని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు నాడు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు కేవలం రూ.5 వేల కోట్లలోపేనని, అయినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విశాఖ స్టీల్‌ప్లాంట్ డివిడెండ్లు, పన్నుల రూపంలో నేటికి రూ.56 వేల కోట్లకుపైగా చెల్లించిందని తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులు, ఆఫీసర్ల సమిష్టి కృషి ఫలితంగా వచ్చిన లాభాలతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సాలీనా 73 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యానికి పెంచగలిగారన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ విలువను రూ.ఐదు వేల కోట్ల నుంచి రూ.మూడు లక్షల కోట్లకు తెచ్చుకోగలిగారన్నారు. రాష్ట్రంలోని పరిశ్రమలకు మణిహారమైన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మడానికి బిజెపి ఎంపి జివిఎల్ నరసింహారావు చేసే తప్పుడు ప్రచారానికి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్లాంట్‌ను అమ్మడానికి చేస్తున్న కుట్రలకు తగు మూల్యాన్ని బిజెపి ప్రభుత్వం చెల్లించుకోనుందని పేర్కొన్నారు.

తెలంగాణలో ఓటేసిన వారికి ఎపిలో ఓటు ఇవ్వొద్దు : వైసిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలంగాణలో ఓటేసిన వారికి రాష్ట్రంలో ఓటు హక్కు కల్పించొద్దని వైసిపి విజ్ఞప్తి చేసింది. అక్కడ ఓటు హక్కు వున్న వారందరి ఓట్లు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని ఎన్నికల కమిషన్‌ను కోరింది. అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర ఎన్నికల సిఇఒ ముఖేష్‌కుమార్ మీనాను వైసిపి తరపున మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగ నాగార్జున మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేయడంలో సిద్ధహస్తుడని అన్నారు. అక్రమాలతో ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు టిడిపి కుట్రలు చేస్తోందని విమర్శించారు. హైదరాబాద్‌లో ఓటు వేసిన వారు ఆంధ్రప్రదేశ్‌లో ఓటు వేయడం నైతికత కాదన్నారు. హైదరాబాద్‌లో చంద్రబాబు ఆధ్వర్యంలో కొత్త ఓటర్ రిజిస్ట్రేషన్ చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌లోని ప్రగతినగర్‌లో బ్యానర్లు కట్టి రిజిస్ట్రేషన్ చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో వైసిపి సానుభూతి పరుల ఓట్లు తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వీటిని అడ్డుకోవాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. అలాగే స్థిర నివాసం ఉన్నచోటే ఓటు హక్కు కల్పించాలని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి డిమాండ్ చేశారు. మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ టిడిపి కండువా కప్పుకుని మాట్లాడాలని సూచించారు.

అధ్యాపకుల నైపుణ్యంపై దృష్టి

- నైపుణ్యాభివృద్ధి, శిక్షణ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యారంగంలో నిరంతరం చోటుచేసుకుంటున్న మార్పులకనుగుణంగా అధ్యాపకులు సైతం నైపుణ్యంపై దృష్టిసారించి, అభివృద్ధి చేసుకోవాల్సి ఉందని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ పేర్కొన్నారు. నిరంతర శిక్షణ ద్వారానే సాంకేతిక విద్యా వ్యవస్థలో మంచి ఫలితాలను సాధించగలుగుతున్నామని తెలిపారు. విజయవాడలోని ధనేకుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీలో నిర్వహిస్తున్న అటల్ ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. డిసెంబరు 9 వరకు ఈ కార్యక్రమం జరగనుండగా, 'అడ్వాన్స్‌మెంట్ ఆన్ విఎల్ఎస్ఐ డిజైన్ అండ్ ఫ్యాబ్రికేషన్ ఫ్రమ్ థియరీ టు ప్రాక్టీస్' అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. పాఠ్యాంశాల అభివృద్ధి మార్గదర్శకత్వం కోసం పరిశ్రమలోని నిపుణులతో నెట్‌వర్కింగ్ అవకాశాలు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్, సెక్రటరీ ధనేకుల భవానీ ప్రసాద్, డైరెక్టర్ డికెఆర్‌కె రవి ప్రసాద్, ప్రిన్సిపల్ కడియాల రవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి అన్నప్రసాదం క్వాలిటీ పెంచాలి : లోకేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుమలలో శ్రీవారి అన్నప్రసాదం అధ్వానంగా ఉందని యాత్రికులు ఆగ్రహిస్తున్నా.. టిటిడి పట్టించుకోవడం లేదని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుమలలో అన్నదాన నిలయాన్ని మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ 1985 ఏప్రిల్ 6న ప్రారంభించారని, అప్పటి నుంచి అంచెలంచెలుగా అందరి సహకారంతో అన్నదాన సత్రాలు విస్తృతంగా ఏర్పాటై ఇప్పటి వరకు కోట్లాది మందికి అన్న ప్రసాదాన్ని అందించి ఆకలి తీర్చాయని లోకేష్ పేర్కొన్నారు. తన కుమారుడు నారా దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా ప్రతియేటా రూ.30 లక్షలను విరాళంగా ఇస్తుంటామని, తనలాగే లక్షలాది మంది దాతలు అన్నప్రసాదానికి విరాళాలు ఇస్తున్నారన్నారు. అన్నప్రసాదం క్వాలిటీని పెంచాలన్నారు.

భారత ఫార్మా సంస్థల్లో యుఎస్‌ఎఫ్‌డిఎ తనిఖీలు

హైదరాబాద్ : భారత్‌కు చెందిన ప్రముఖ ఫార్మా సంస్థల్లో అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (యుఎస్‌ఎఫ్‌డిఎ) తనిఖీలు నిర్వహిస్తుంది. హైదరాబాద్‌లోని డాక్టర్ రెడ్డీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను యుఎస్‌ఎఫ్‌డిఎ తనిఖీ చేసినట్లు ఆ సంస్థ ప్రతినిధి మంగళవారం మీడియాకు తెలిపారు. అలాగే విశాఖపట్నంలోని లారస్ ల్యాబ్స్ అనుబంధ సంస్థ లారస్ సింథసిస్ యూనిట్‌ను కూడా యుఎస్‌ఎఫ్‌డిఎ తనిఖీ చేసినట్లు సమాచారం. వీటితో పాటు సన్ ఫార్మా యూనిట్లు, టోరెంట్ ఫార్మా స్యూటికల్స్ లిమిటెడ్ యొక్క ఆంకాలజీ యూనిట్లను కూడా యుఎస్ ఎఫ్‌డిఎ తనిఖీ చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ తనిఖీలపై సంస్థలు స్పందించలేదు.

అన్ని శాఖల కార్యదర్శులతో బడ్జెట్‌పై నేడు కీలక సమీక్ష

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వార్షిక బడ్జెట్ కసరత్తుపై తొలి సమావేశం బుధవారం జరగనుంది. ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఈ సమావేశం జరగనుంది. అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు ఈ భేటీకి హాజరుకావాలని ఆర్థికశాఖ సర్క్యులర్ జారీ చేసింది. ఇప్పటికే 2024-25 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రతిపాదనల కోసం పూర్తి స్థాయి మార్గదర్శకాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఓట్ ఆన్ అకౌంట్ విధానంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నప్పటికీ, శాసనసభలో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి అందులో మూడు లేదా ఆరు నెలలకు శాసనసభ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. దీనిపైనే బుధవారం అన్ని శాఖలతో చర్చించాలని భావిస్తున్నారు. ఈ భేటీలోనే 2023-24 సంవత్సరానికి సంబంధించిన సవరణ బడ్జెట్‌పై చర్చించనున్నారు.

10న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర మహాసభ

- బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- గుంటూరు

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర మహాసభ ఈ నెల పదిన విజయవాడలోని జింఖానా గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నట్లు అమరావతి జెఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఆయన గుంటూరు రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా సమావేశంలోనూ, అనంతరం మీడియానూ మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు రెండు లక్షల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారని, వారిలో లక్ష మందినే అప్కాస్‌లో చేర్చారని, మిగిలిన వారినీ చేర్చాలని కోరారు. వేతనాలు పెంచాలని, ఏటా క్రమం తప్పకుండా జీతాల పెంచాలని, మెప్మా, సెర్ప్‌లో మాదిరిగా ఇతర అన్ని శాఖల్లోనూ ఉద్యోగ భద్రత కల్పించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని తదితర సమస్యలపై మహాసభలో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఎన్నికల కమిషనర్ల బిల్లుకు సవరణలు చేయండి

- ఎంపీలకు విద్యావేత్తల బహిరంగ లేఖ

న్యూఢిల్లీ : ప్రస్తుత పార్లమెంట్ సమావేశాలలో చర్చకు వచ్చే అవకాశమున్న ఎన్నికల కమిషనర్ల బిల్లులో సవరణలు చేయాలని పలువురు విద్యావేత్తలు, ప్రభుత్వ మాజీ ఉన్నతోద్యోగులు, హక్కుల కార్యకర్తలు ఎంపీలను కోరారు. ఈ మేరకు ఓ బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల కమిషన్ రాజకీయాలకు అతీతంగా, స్వతంత్ర సంస్థగా వ్యవహరించేలా చూడాలని వారు డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర కమిషనర్ల బిల్లును పార్లమెంటులో తిరిగి ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ప్రతిపాదిత బిల్లు దేశ ప్రజాస్వామ్యాన్ని నీరుకారుస్తుందని, ఏకపార్టీ పాలనకు దారితీస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్ అనూప్ చంద్ర పాండే వచ్చే ఫిబ్రవరిలో పదవీవిరమణ చేయనున్న నేపథ్యంలో తమ అభ్యర్థనను అత్యవసరమైనదిగా పరిగణించాలని వారు కోరారు. ఈ బిల్లు ప్రస్తుత రూపంలోనే ఆమోదం పొందితే పాండే వారసుడి ఎంపిక ప్రక్రియలో పారదర్శకత లోపిస్తుందని, రాబోయే ఎన్నికల దృష్ట్యా ఎన్‌డిఎ ప్రభుత్వం తనకు ఇష్టమైన వ్యక్తిని ఆ పదవిలో కూర్చోబెట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్‌ను, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను, ఇతర కమిషనర్లను నియమించే ఎంపిక కమిటీకి ప్రధాని ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. ప్రతిపక్ష నేత, ప్రధాని నియమించే క్యాబినెట్ మంత్రి సభ్యుడిగా ఉంటారు. గతంలో ఈ కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తి సభ్యుడిగా ఉండేవారు. ఆయనను కమిటీ నుండి తప్పిస్తూ కేంద్రం బిల్లు తీసుకొచ్చింది. 'ఎన్నికల కమిషన్ రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తూ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సి ఉంది. తాజా బిల్లులోని పలు నిబంధనలు ఈ విషయాన్ని విస్మరించాయి. కమిషన్ సమగ్రతను కాపాడాలంటే కొన్ని చట్టపరమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఎంపిక కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తిని చేర్చాలి. ఈసీ సభ్యుడికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి హోదా కల్పించాలి. సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించేందుకు అనుసరించే పద్ధతులనే ఎన్నికల కమిషనర్లకు వర్తింపజేయాలి. ఎంపిక కమిటీ ప్రొసీడింగ్స్‌ను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలి' అని ఆ లేఖలో సూచించారు. బహిరంగ లేఖపై అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (హైదరాబాద్) మాజీ ప్రిన్సిపాల్ ఇఎఎస్ శర్మ, ఐఐఎం అహ్మదాబాద్ మాజీ ప్రొఫెసర్ జగదీప్ ఎస్ ఛోకర్, మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ నేత అరుణా రాయ్, జెఎన్‌యు ప్రొఫెసర్ ఎమరిటస్ ప్రభాత్ పట్నాయక్, ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు ఎస్‌పి శుక్లా తదితరులు సంతకాలు చేశారు.

'క్యాష్ ఫర్ కిడ్నీ' కేసులో అపోలోపై విచారణ

న్యూఢిల్లీ : 'క్యాష్ ఫర్ కిడ్నీ' కుంభకోణం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇంద్రప్రస్థ అపోలో ఆసుపత్రిపై విచారణ ప్రారంభమయింది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆర్గనైజేషన్ (ఎన్ఒటిటిఒ) ఈ విచారణను చేపట్టింది. ఈ మేరకు ఎన్ఒటిటిఒ మంగళవారం తెలిపింది. మయన్మార్‌కు చెందిన వ్యక్తులను ప్రలోభాలకు గురి చేసి 'క్యాష్ ఫర్ కిడ్నీ' స్కామ్ జరుగుతోందని, ఈ స్కామ్‌లో అపోలో ఆసుపత్రి ప్రమేయం ఉందని జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. అపోలోలో ఏడాదికి 1,200 కంటే ఎక్కువగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జరుగుతున్నాయని ఆ కథనాల్లో పేర్కొన్నారు. 'మయన్మార్ నుండి యువకులను అపోలో ఢిల్లీ ఆసుపత్రికి తరలించి, అక్కడ వారి కిడ్నీలను ధనిక రోగులకు దానం చేయడానికి డబ్బు చెల్లిస్తున్నారు' మీడియా కథనాల్లో వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఎన్ఒటిటిఒ విచారణ చేపట్టింది. కాగా తమపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా కల్పితాలని ఇంద్రప్రస్థ అపోలో యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. మీడియా కథనాలను ఇంద్రప్రస్థ మెడికల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఎంసిఎల్) కూడా ఖండించింది.

సంపాదకీయం

బలవన్మరణాలు

లోకపుటన్యాయాలూ, కాల్చే ఆకలి, కూల్చే వేదన, దారిద్ర్యాలూ, దౌర్జన్యాలూ తట్టుకోలేక, శ్రమ నిష్ఫలమై, జన నిష్ఠురమై నూతిని గోతిని వెదకే వాళ్లు పెరిగిపోతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఆత్మహత్యలు చేసుకున్న వారిలో మూడింట ఒక వంతు దినసరి వేతన జీవులు, వ్యవసాయ కార్మికులు, రైతులేనని 2022 ఎన్‌సిఆర్‌బి నివేదిక తేల్చిచెప్పింది. కుటుంబ సమస్యలు, అనారోగ్యం పేరుతో సాగుతున్న బలవన్మరణాలు దాదాపు సగం ఉన్నాయి. కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలు పేదల పాలిట మరణశాసనంగా మారిపోతున్నాయి. అదానీ, అంబానీ లాంటి సంపన్నులకు గత తొమ్మిదేళ్లలో రూ.14.56 లక్షల కోట్ల బ్యాంకు రుణాలను రైట్ ఆఫ్ చేసినట్లు గత ఆగస్టులో పార్లమెంట్‌లో కేంద్రప్రభుత్వం తెలిపింది. మరోవైపు పేదలకు, రైతులకు రాష్ట్రప్రభుత్వాలు ఇచ్చే సబ్సిడీలను, కొద్దిపాటి ఉపశమనాలను రేవడీలంటూ నానా యాగీ చేస్తోంది. నిరుద్యోగం తాండవిస్తోంది. ఉపాధి అవకాశాలు రోజురోజుకూ కుంచించుకుపోతున్నాయి. మనుగడ సాగించడమే ప్రశ్నార్థకమవుతున్న తరుణంలో ఆత్మహత్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు వ్యవసాయ రంగాన్ని అప్పగించే యత్నాల్లో భాగంగా దుర్భరమైన పరిస్థితులే ఈ ఆత్మహత్యలకు కారణమవుతున్నాయి. ఓ వైపు లక్షల కోట్లు మాఫీ అయిపోతుండగా, మరోవైపు వ్యవసాయం కోసం వేలల్లో, లక్షల్లో చేసిన అప్పులు చెల్లించలేక ఆత్మాభిమానంతో రైతులు, వ్యవసాయ కార్మికులు ఉసురుతీసుకుంటున్నారు. వ్యవసాయ రంగంలో 2022లో 11,290 ఆత్మహత్యలు చోటుచేసుకున్నాయి. అంతకుముందు ఏడాదితో పోలిస్తే 3.75 శాతం పెరుగుదల నమోదైంది. వీటిలో 9.6 శాతం మంది స్వయం ఉపాధి పొందుతున్న వారు, వేతనాలు పొందుతున్న వృత్తిదారులు ఉన్నారు. నిరుద్యోగుల ఆత్మహత్యలు 9.2 శాతంగా ఉన్నాయి. 12 వేల మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు కరువవడం, విజృంభిస్తున్న నిరుద్యోగం, ఉపాధి హామీ పనులు సైతం బాగా తగ్గిపోవడం, చదువుల ఒత్తిడి తదితరాలు ఈ ఆత్మహత్యల పరంపరకు కారణమవుతున్నాయి.

మరోవైపు మహిళలు, పిల్లలపై హింస రోజురోజుకూ పెరిగిపోతోంది. ప్రపంచంలో ప్రతి ముగ్గురిలో ఒకరు లింగవివక్షకు, హింసకు గురవుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పింది. మన దేశంలోనూ మహిళల పరిస్థితి అందుకు భిన్నంగా ఏమీ లేదు. గత ఏడాది 4,45,256 కేసులు నమోదయ్యాయి. 2021తో పోలిస్తే నాలుగు శాతం పెరిగాయి. వీటిలో భర్త, అతని బంధువుల క్రూరత్వం, మహిళలను కిడ్నాప్ చేయడం, అపహరించడం, ఆమె ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేందుకు దాడి చేయడం, అత్యాచారం చేయడం వంటివి ఉన్నాయి. 48 వేల మంది మహిళలు బలవన్మరణానికి పాల్పడగా, వారిలో 52 శాతం మంది గృహిణులే. మిగిలిన వారిలో విద్యార్థినులు, దినసరి వేతనంపై ఆధారపడే వారు ఉన్నారు. ఆత్మహత్యలకు ప్రధాన కారణంగా ప్రభుత్వాలు ఆదాయ వనరుగా మార్చుకున్న మద్యం, మత్తు మందులు వినియోగించి ఇళ్లను పట్టించుకోని కుటుంబ పెద్దలు ఉండటం, వివాహ సంబంధిత సమస్యలు, కట్నం లాంటివే ఉన్నాయి. 2016 నుంచి 26.35 శాతం పెరుగుదల ఉందన్న ఎన్‌సిఆర్‌బి నివేదిక మోడీ ప్రభుత్వ హయాంలో నలిగిపోతున్న మహిళల జీవన చిత్రాన్ని తేటతెల్లం చేసింది. పిల్లలపై నేరాలు కూడా 2021తో పోలిస్తే 8.7 శాతం పెరిగాయి. 1,62,449 కేసులు నమోదయ్యాయి. పోక్సో చట్టం అమలులో ఉన్నా నేరాలు పెరుగుతుండటం ఆందోళనకరం. అణగారిన వర్గాలపై హింస ఏమాత్రం తగ్గడం లేదు. పెత్తందారీ వ్యవస్థ బలంగా ఉన్న హిందీ భాషా రాష్ట్రాల్లో ఈ పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. 2021తో పోలిస్తే ఎస్‌సిలపై 13.1 శాతం, ఎస్‌టిలపై 14.3 శాతం అధికంగా కేసులు నమోదయ్యాయి. ఇటువంటి నేరాలు అత్యధికంగా జరుగుతున్న తొలి ఐదు రాష్ట్రాల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, బీహార్, ఉత్తర ప్రదేశ్, ఒడిశా ఉన్నాయి. నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు విడుదలయ్యే వరకూ ఈ నివేదిక బయటకు రాకుండా తొక్కిపట్టడంలోనే కేంద్రప్రభుత్వ మోసకారితనం కనిపిస్తోంది. నయా ఉదారవాద విధానాలను తిప్పికొట్టేందుకు సంఘటితంగా, సమైక్యంగా పోరాడితేనే బలవన్మరణాలు, నేరాల నుంచి బయటపడగలం.

మహనీయుల మాట



సంపద సముద్రపు నీరు లాంటిది.
మనం ఎంత ఎక్కువ తాగితే
అంత ఎక్కువ దాహం అవుతుంది.
- ఆర్థర్ స్కోపెన్ హౌర్,
జర్మన్ తత్వవేత్త.

సందర్భం

భారత రాజ్యాంగం - బాబ్రీ మసీదు - బాబా సాహెబ్



ఎస్. వినయ కుమార్

కాకతాళీయమో! కాదో! కానీ భారతరత్న బాబాసాహెబ్ డా॥ బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి రోజే (డిసెంబర్ 6) కాషాయ పరివారం బాబ్రీ మసీదును కూల్చింది. భారత రాజ్యాంగమన్నా, చర్చి, మసీదులన్నా వారికి చెప్పలేనంత కడుపు మంట. దేశ పౌరుల్లో పర మత ద్వేషభావాన్ని పెంచి అధికారంలోకి రావడం కోసం వారు బాబ్రీ మసీదును లక్ష్యం చేసుకొన్నారు. ఇప్పుడు లౌకికతత్వం, రాజకీయ ప్రజాస్వామ్యం ప్రబోధించే భారత రాజ్యాంగాన్ని దాని విలువలను నీరుగార్చే పనిలో ఉన్నారు. సమానత్వం, సౌభ్రాతృత్వం, పౌరులందరికీ వర్తించే చట్టం, ప్రజలందరికీ జీవించే హక్కు, భావప్రకటనా స్వేచ్ఛ వంటి విలువలకు పాడె కడ్తున్నారు.

భారత రాజ్యాంగం మతంతో నిమిత్తం లేకుండా దేశంలోని పౌరులందరికీ సమాన హోదా కల్పించింది. హిందూ మహాసభ, ఆర్‌ఎస్‌ఎస్‌లు కోరుకొన్నదే బిజెపి కూడా కోరుకొంటున్నది. భారతదేశం హిందువులదని, ఈ దేశంలో క్రైస్తవులు, ముస్లింలు తమ నివాసాన్ని కొనసాగించాలనుకొంటే రెండవ తరగతి పౌరుల్లా, హిందువులకు లోబడి బతకాలని ఆ సంస్థల సిద్ధాంతం. వినాయక్ దామోదర్ సావర్కర్, మహదేవ్ సదాశివరావ్ గోల్వాల్కర్ చాలా స్పష్టంగానే తమ రాతల్లో ఈ సిద్ధాంతాన్ని ప్రవచించారు. కాని భారత రాజ్యాంగం ఆ వాదనను పట్టించుకోలేదు. పౌరులందరికీ ఒకే విలువగల ఓటు హక్కునిచ్చింది. కుల మతాలతో నిమిత్తం లేకుండా మహిళలతో సహా భారత పౌరులందరికీ ఒకే రీతిగా చట్టాలు అమలవుతాయి. వారసత్వ చట్టాల్లో మాత్రం కొన్ని తేడాలున్నాయి.

భారతీయులందరూ ఒక జాతి కాదంటూ రెండు జాతుల సిద్ధాంతాన్ని మొట్టమొదట ప్రతిపాదించింది సావర్కర్. బ్రిటిష్ ప్రభుత్వానికి క్షమాభిక్ష దరఖాస్తు పెట్టుకొని అండమాన్ జైలు నుండి విడుదలయిన సావర్కర్ బ్రిటిష్ పాలకులకు ఇచ్చిన మాట ప్రకారం స్వతంత్ర పోరాటం నుండి దూరంగా ఉన్నారు. హిందూ మహాసభకు అధ్యక్షుడయ్యాడు. భారత దేశంలో హిందూ, ముస్లిం రెండు జాతులున్నాయని సిద్ధాంతీకరించారు. ముస్లిం లీగ్ అధ్యక్షుడు మహ్మదాలీ జిన్నా ఆ తర్వాత అదే వాదనను అందుకొన్నారు. ఫలితం భారతదేశ విభజన. 'విభజించు పాలించు' విధానాన్ని వర్తింపచేసిన బ్రిటిష్ వలస పాలకులకు కావాల్సింది అదే కాగా ఆర్‌ఎస్‌ఎస్, దాని పరివారం విభజన పాపాన్ని మొదట మహాత్మా గాంధీ నెత్తికి చుట్టింది. ఇప్పుడు నెహ్రూ నెత్తికి చుడుతున్నారు. మహాత్ముడిపై గౌరవం ఒలకబోస్తూనే స్వాతంత్ర్యోద్యమంలోకి విశాల ప్రజానీకాన్ని సమీకరించిన ఆయన కృషిపై దుప్పటి కప్పి ఆయనను 'స్వచ్ఛత'కు పరిమితం చేశారు. పనిలో పనిగా 'స్వచ్ఛ భారత్' పేర 0.5 శాతం పన్నును జిఎస్‌టికి చేర్చారు.

రాజ్యాంగ రచనా సంఘానికి అంబేద్కర్ అధ్యక్షుడే అయినా, అనేక రకాలైన సాంప్రదాయ వాదులతో కూడింది మన రాజ్యాంగ సభ. ఆ సభలో కొందరు పెద్దలకు హిందూ మహాసభకు ఉండే ఛాందస, ఒంటెత్తు భావనలు ఉన్నాయి. అయినప్పటికీ స్వాతంత్రోద్యమం నాటి విలువలపై ఆధారపడి భారత రాజ్యాంగ నిర్మాణం జరిగింది. కాని భారత రాజ్యాంగం మనది కాదు. మువ్వన్నెల జెండా మనది కాదు. భారత రాజ్యాంగం ఒక అతుకుల బొంత. పశ్చిమ దేశాల నుండి అక్కడ కొంత ఇక్కడ కొంత తెచ్చి జోడించారు. అది భారత్‌కు పనికి రాదు...అంటూ కాషాయ దళాలు ఈసడిస్తుంటాయి. మువ్వన్నెల జెండా కూడా పశ్చిమ దేశాల తరహాలో ఉంది. మన జెండా కాషాయ రంగులో మధ్యలో ఒక చీలికతో ఉండాలని వాదిస్తుంటారు. చిత్‌పావన్ బ్రాహ్మణులైన పీష్వా పాలకుల కాషాయ జెండానే మన జాతీయ జెండాగా ఉండాలని వారి అభిమతం.

కులమతాలతో నిమిత్తం లేకుండా ఒక నేరానికి ఒకే శిక్ష విధించాలని చెప్పే మన చట్టాలు సహజంగానే వారికి జీర్ణం కానివి. వర్ణం ప్రకారం శిక్షలు, హక్కులు, ఆస్తులు ఉండాలని మనుస్మృతి చెప్తుంది. అందుకనే అంబేద్కర్ మహర్ పోరాటం సందర్భంగా మనుస్మృతిని తగలబెట్టారు. అలాంటి మనుస్మృతి సాంప్రదాయవాదులకు శిరోధార్యం. మనుస్మృతిని తగలబెడితే వారు విలవిలలాడతారు. ఫ్యూడల్ ప్రభువుల ప్రాపకంతో వారి పాత్రతో మతతత్వ పార్టీలైన హిందూ మహాసభ, ఆర్‌ఎస్‌ఎస్, ముస్లింలీగ్ పుట్టుకొచ్చాయి. కనుక వాటికి ఇప్పటికీ ఫ్యూడల్ విలువల పట్ల వారికి మోజు. ఆ విలువలు కష్టజీవులనే కాదు, మహిళలనూ అణిచి వుంచాలని చూస్తాయి. భారత రాజ్యాంగం మహిళలకు సమాన పౌరసత్వాన్ని కల్పిస్తోంది.

స్వతంత్ర పోరాటం సందర్భంగా సామాజిక, ఆర్థిక రంగాల్లో చేయాల్సిన పోరాటాన్ని, తన వర్గ స్వభావం వల్ల కాంగ్రెస్ నాయకత్వం వాయిదా వేసింది. స్వాతంత్ర్యం వచ్చాక వాటి సంగతి చూసుకోవచ్చని చెప్పింది. కాని స్వతంత్ర భారతంలో కూడా వాటిని సమగ్ర దృష్టితో చేపట్టలేదు. ఓటు బ్యాంకు రాజకీయాల దృష్టితో క్రమంగా మృదు హిందూత్వను అనుసరించింది. ముస్లింలలో ప్రజాస్వామిక సంస్కరణల కోసం ప్రయత్నించకుండా సాంప్రదాయ శక్తులను సంతృప్తి పరిచే విధానాన్ని అనుసరిస్తూ అంబేద్కర్ చేసిన హెచ్చరికను పెడచెవినబెట్టారు. తద్వారా ప్రభుత్వాలు మెలమెల్లగా రాజకీయ ప్రజాస్వామ్యానికీ ప్రమాదం తెచ్చిపెట్టాయి.

అక్కడో నల్లరాయి ఇక్కడో తెల్లరాయి పేర్చినట్లుగా భారత రాజ్యాంగాన్ని రూపొందించి ఉంటే ఇంత కష్టపడాల్సిన అవసరం ఉండేది కాదని అంబేద్కర్ రాజ్యాంగ సభకు రాజ్యాంగాన్ని సమర్పిస్తూ చెప్పారు. పార్టీ క్రమశిక్షణకు పరిమితం కాకుండా సభ్యులు చర్చల్లో అనేక విషయాలను ముందుకు తెచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు. అదే సందర్భంలో ఒక హెచ్చరిక చేశారు.

"జనవరి 26, 1950తో మనం ఒక వైరుధ్యభరితమైన జీవితంలోకి ప్రవేశిస్తున్నాం. రాజకీయాల్లో మనకు సమానత్వం ఉంటుంది. కాని సామాజిక, ఆర్థిక రంగాల్లో అసమానత ఉంటుంది. రాజకీయాల్లో ఒకరికి ఒకే ఓటు, ఒక ఓటుకు ఒకే విలువ అన్న సూత్రాన్ని అనుసరిస్తాం. కాని మన సామాజిక, ఆర్థిక నిర్మాణం కారణంగా మనుషులందరికీ ఒకే విలువ అన్న సూత్రాన్ని నిరాకరిస్తాం. ఈ వైరుధ్యాల మధ్య మనం ఎంతకాలం ఉండగలం? సామాజిక, ఆర్థిక రంగాల్లో ఎంతకాలం సమానత్వాన్ని నిరాకరించగలం. చాలా కాలం పాటు ఈ నిరాకరణ సాగితే మనం రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టిన వారమవుతాం. వీలైనంత త్వరగా మనం ఈ వైరుధ్యాన్ని తొలగించాలి. లేకపోతే మనం ఎంతో కష్టపడి రూపొందించుకొన్న రాజకీయ ప్రజాస్వామ్య నిర్మాణం పేలిపోతుంది" అన్నారు.

మోడీ పాలనలో బిజెపి తన మతతత్వ విధానాలను బాహాటంగా అమలు చేయడానికి పూనుకొంది. రాజ్యాంగ సంస్థలను తన రాజకీయ ప్రయోజనాలను సాధించే పనిముట్లుగా మార్చుకొంది. ఎన్నికల సంఘం, పోలీసు విభాగాలు వెన్నెముక లేని సంస్థలయ్యాయి. ఎలక్టొరల్ బాండ్ల పేర అవినీతికి, ఆశ్రిత పెట్టుబడిదారులకు ప్రజల సొమ్మును ధారపోసే విధానాలను కాంగ్రెస్ కంటే నిస్సిగ్గుగా అమలు చేస్తోంది. తీవ్రమైన నేర చట్టాల కింద కేసులు బనాయించి ఏళ్ల తరబడి జైల్లో పెడుతోంది. ఆ కేసులు విచారణకు సైతం రావు. నిందితులు అలా జైళ్లలో ఉండిపోవాల్సి వస్తుంది. మీడియా స్వేచ్ఛను కొనేసింది. అడ్డగోలు వాదనలకు వార్తలకు సోషల్ మీడియాను పెంచి పోషిస్తోంది. పార్లమెంట్‌ను ఒక ప్రహసనంగా మార్చింది. ప్రతిపక్షంలో ఉండగా చెప్పిన సుద్దులు ఒక్కటీ పాటించదు. తనకు అవసరమైన బిల్లులను పేరుకే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి తగిన చర్చకు అవకాశమివ్వకుండా ఆమోద ముద్ర వేసుకొంటుంది. రాష్ట్రాల్లోని గవర్నర్లు అధికారిక చొరబాటుదారుల్లా రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బంది పెడ్తున్నారు. మోడీకి, షా కు మాత్రమే మేము జవాబుదారీ అన్నట్లు వ్యవహరిస్తున్నారు. సుప్రీంకోర్టు వాఖ్యలను, తీర్పులను పట్టించుకోవడం లేదు. మెజారిటీ మతతత్వం నియంతృత్వం వైపునకు, మైనారిటీ మతతత్వం టెర్రరిజం వైపు వెళ్తాయన్న అంచనాలను మోడీ ప్రభుత్వం ఆచరణలో అమలు చేసి చూపెడుతోంది.



కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి లౌకిక విలువలు, సమానత్వం అన్నవి నచ్చని అంశాలు. అందుకనే పార్లమెంట్ నూతన భవనం ప్రారంభంలో సభ్యులకు ఇచ్చిన రాజ్యాంగ పుస్తకాల ప్రవేశికలో సెక్యులర్, సోషలిస్టు అన్న పదాలను తొలగించారు. ఎమర్జెన్సీలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆ పదాలను చేర్చారు కనుక ఆ పదాలను తాము తొలగించినట్లు వివరణ ఇచ్చారు. కాని వాస్తవం ఏమిటంటే ఆచరణలో రాజ్యాంగ మూల స్వభావాన్నే బిజెపి మార్చాలనుకొంటోంది. ప్రభుత్వాన్ని మతంతో కలగాపులగం చేస్తోంది. మత సామరస్యం కోసం ప్రాణాలివ్వడానికి సిద్ధపడిన మహాత్మా గాంధీని చంపిన గాడ్సేని అనధికారికంగా ఆకాశానికి ఎత్తుతోంది. గాంధీజీ హత్య కేసులో సరైన సాక్ష్యాలు లేక బయటపడిన సావర్కర్ విగ్రహాన్ని పార్లమెంట్‌లో ప్రతిష్టించింది.

రాజ్యాంగ సభలో ప్రొ॥ కె.టి.షా అనే సభ్యుడు రాజ్యాంగంలోని ఆర్టికల్ 1, క్లాజు 1లో సెక్యులర్, ఫెడరల్, సోషలిస్టు అనే పదాలను చేర్చాలని ప్రతిపాదించారు. అంబేద్కర్ ఆ పదాలు అవసరం లేదని ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల్లో భాగంగా రాజ్యాంగ ముసాయిదాల్లో భాగంగా అవి ఉన్నాయని చెప్పారు. న్యాయ ప్రక్రియలో అనుసరించాల్సిన సోషలిస్టు సూత్రాలను, సమానత్వం, నిష్పాక్షికత వంటి అంశాలను కూడా ఇదివరకే చేర్చామని చెప్పారు. లౌకిక విలువలకు అంబేద్కర్ గట్టిగా కట్టుబడి ఉన్నారు. న్యాయం-సమానత్వం గురించి బలంగా రాజ్యాంగ ముసాయిదాలో చెప్పామన్నారు. దేశ నిర్మాణం సందర్భంగా అనుసరించాల్సిన సౌభ్రాతృత్వంపై ఆయన సభలో అనర్గళంగా మాట్లాడారు. రాజ్యాంగ సభలో జరిగిన చర్చల సరళిని బట్టి చూసినా భారతదేశాన్ని ఒక మత రాజ్యంగా మార్చే భావన ఎక్కడా కన్పించదని న్యాయ నిపుణులు చెప్తున్నారు.

కాని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి లౌకిక విలువలు, సమానత్వం అన్నవి నచ్చని అంశాలు. అందుకనే పార్లమెంట్ నూతన భవనం ప్రారంభంలో సభ్యులకు ఇచ్చిన రాజ్యాంగ పుస్తకాల ప్రవేశికలో సెక్యులర్, సోషలిస్టు అన్న పదాలను తొలగించారు. ఎమర్జెన్సీలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆ పదాలను చేర్చారు కనుక ఆ పదాలను తాము తొలగించినట్లు వివరణ ఇచ్చారు. కాని వాస్తవం ఏమిటంటే ఆచరణలో రాజ్యాంగ మూల స్వభావాన్నే బిజెపి మార్చాలనుకొంటోంది. ప్రభుత్వాన్ని మతంతో కలగాపులగం చేస్తోంది. మత సామరస్యం కోసం ప్రాణాలివ్వడానికి సిద్ధపడిన మహాత్మా గాంధీని చంపిన గాడ్సేని అనధికారికంగా ఆకాశానికి ఎత్తుతోంది. గాంధీజీ హత్య కేసులో సరైన సాక్ష్యాలు లేక బయటపడిన సావర్కర్ విగ్రహాన్ని పార్లమెంట్‌లో ప్రతిష్టించింది.


భారత పౌరులు ఏ మతాన్నయినా అనుసరించవచ్చు. ఏ మతాన్నయినా స్వీకరించవచ్చు. అది ప్రాథమిక హక్కు. అందుకు విరుద్ధంగా బిజెపి వారు రాష్ట్రాల్లో మత మార్పిడి నిరోధక చట్టాలు తెచ్చారు. మతాంతర వివాహాలకు లవ్ జిహాదీ సాకు చూపి అడ్డుపడి ప్రాథమిక హక్కును హరించివేస్తున్నారు. ఈ నేపథ్యంలో...భారత రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన, అనుసరించదల్చుకొన్న మౌలిక విలువలు ఏమిటి? నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరిస్తున్న విలువలేమిటి? ఒకసారి బేరీజు వేసుకోవాల్సిన రోజు ఇది.

(వ్యాసకర్త 'ప్రజాశక్తి' పూర్వ సంపాదకులు)

★

వ్యాసం

కర్షక, కార్మిక విశాల ఐక్యతను చాటిన ఘట్టం



వి. కృష్ణయ్య

అత్యంత ఉత్తేజభరితంగా గత నెల 27, 28 తేదీల్లో విజయవాడ లోని జింఖానా మైదానంలో జరిగిన కార్మిక, కర్షక మహా ధర్నా...రాష్ట్ర రైతాంగ ఉద్యమ చరిత్రలో ఒక నూతన పుటను ఆవిష్కరింపచేసింది. కార్మిక, కర్షక విశాల ఐక్యతను చాటిచెప్పింది. ఇదో చారిత్రక ఘట్టంగా చెప్పుకోవచ్చు. రాష్ట్రం నలుమూలల నుంచి కార్మిక, కర్షక సమూహాలు, ముఖ్యంగా రైతు, కార్మిక మహిళలు చంటి బిడ్డలను చంకలో వేసుకొని మహా ధర్నాకు హాజరవడం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. భారత రాజ్యాంగానికీ, రాజ్య వ్యవస్థలకూ, కార్మిక, కర్షకులు సాధించుకున్న చట్టాలకూ, ప్రజాస్వామ్య పద్ధతులకూ తిలోదకాలిస్తున్న నరేంద్ర మోడీని గద్దె దించాలని ధర్నా ఘంటాపథంగా నిర్ణయించింది. 20 లక్షల మంది కార్మికులు ప్రతి ఏటా రూ.2 లక్షల కోట్ల మిగులును సాధిస్తున్న కేంద్ర ప్రభుత్వ సంస్థలను తక్కువ ధరలకే అమ్మివేయబూనడాన్ని ధర్నా తీవ్రంగా వ్యతిరేకించింది. 'ది వైర్', 'న్యూస్ క్లిక్' మీడియాపై అప్రజాస్వామికంగా దాడి చేసి ప్రబీర్ పుర్కాయస్థ సహా ముఖ్య పాత్రికేయులను అరెస్టు చేసి ఆ సంస్థలను మూసివేయడం మోడీ ప్రభుత్వం నియంతృత్వానికి ప్రబల నిదర్శనమని పేర్కొన్నది.

వ్యవసాయ రంగానికి ఎంతో సేవ చేసిన భారత ముద్దుబిడ్డ ప్రొఫెసర్ ఎం.ఎస్. స్వామినాథన్‌కు, అఖిల భారత రైతాంగ నాయకుడు శంకరయ్యకు, రైతు పక్షపాతి, ఇంజినీరు వీరయ్య చౌదరికి ధర్నా ప్రగాఢ సంతాపాన్ని తెలిపింది. భారత వ్యవసాయాన్ని నాశనం చేసే మూడు నల్ల చట్టాలపై ప్రతిఘటనోద్యమంలో నాలుగు వేల మందిపై కేసులు బనాయించి..750 మంది రైతుల ప్రాణాలను పొట్టనబెట్టుకున్న రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలను ఉపసంహరింప చేసి..మోడీ మెడలు వంచి రైతాంగానికీ, దేశ ప్రజలకూ క్షమాపణ చెప్పించి ఎంతో ఉత్తేజాన్నిచ్చిన నాటి రైతు ఉద్యమానికి జేజేలు పలికింది.

అన్ని వ్యవసాయ పంటలకూ కనీస మద్దతు ధరల చట్టం చేయాలన్నది రైతాంగ ప్రధాన నినాదంగా ముందుకు వచ్చింది. పెరిగే ధరలకు మోడీ ప్రభుత్వం ఊతమిస్తున్నది. కేరళ తరహాలో 14 రకాల నిత్యావసర సరకులను రాయితీపై చౌక డిపోల్లో అందుబాటులోకి తీసుకురావాలని మహా ధర్నా కోరింది. ఇలాంటి పోరాటాల్లోకి తాము కూడా వస్తామని ఉపాధ్యాయులు, పాత్రికేయులు, ప్రభుత్వోద్యోగులు మహా ధర్నా ప్రాంగణానికి వచ్చి సంఘీభావం తెలియజేశారు. ఉద్యోగ వర్గాలకు కొత్తవి సాధించడం కాదు! ఉన్న సౌకర్యాలు పోకుండా వాటిని నిలబెట్టుకోవడం పెద్ద పోరాటంగా ఉందని ప్రకటించారు.

ప్రభుత్వాలు వ్యవసాయానికి ప్రాణప్రదమైన నీటిని అందించలేకపోతున్నాయి. జూన్ నుంచి అక్టోబరు వరకూ నాలుగు నెలల్లోనే 2600 టిఎంసిల నీళ్ల కృష్ణా, గోదావరి నదుల నుంచి సముద్రంలో కలిసిపోగా పోలవరం పడిగాపులు కాస్తోంది. 400 వరకూ చిన్న, మధ్య తరహా ప్రాజెక్టులు ఎప్పుడు పూర్తి చేస్తారని మెట్ట ప్రాంత పొలాలు నోళ్లు తెరిచి అడుగుతున్నాయి. గోదావరి నీరు సముద్రంలో కలిసే గాడిమొక దగ్గర బయటకు తీస్తున్న ప్రకృతి సహజ వనరులైన గ్యాస్, పెట్రోలియంలను రిలయన్స్ గుజరాత్‌కు తరలిస్తున్నది. ఆ కంపెనీ సంవత్సరానికి సుమారు రూ.2 లక్షల కోట్లను మూటకట్టకుంటోంది. దాన్ని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఉపయోగించాలని మహా ధర్నా డిమాండ్ చేసింది.



అమరావతి రాజధాని ఆగమైపోయింది. దీనికి బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలది. కేంద్రం చేస్తానన్న సాయం రూ.1500 కోట్ల దగ్గరే నిలిచిపోయింది. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మూడు రాజధానుల సిద్ధాంతంతో ఆంధ్ర విస్తుపోయింది. ఆంధ్రప్రదేశ్ ఇల్లు లేని కుటుంబంలా రాజధాని లేని రాష్ట్రం అయ్యింది. దీంతో పెట్టుబడులన్నీ ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయి.

రాష్ట్ర విభజన హామీలు ఏపీ అమలు కాలేదు. అభివృద్ధి ఆగిపోయింది. ప్రత్యేక హోదా గాలికిపోయింది. దీనికి కేంద్ర నిర్లక్ష్య వైఖరే కారణం. రాష్ట్ర ప్రభుత్వ చేతగానితనం. చివరికి నష్టపోయింది ఆంధ్ర ప్రజలు. పారిశ్రామిక రంగం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుంది. వేలాది చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతపడ్డాయి. లక్షలాది కార్మికులకు కనీస వేతనాలు పెంచలేదు. నిరంతరం పెరుగుతున్న విద్యుత్తు ఛార్జీలు, స్మార్ట్ మీటర్ల బిగింపు, విద్యుత్ వ్యవస్థను ప్రైవేటీకరించడం ప్రజలకు పెనుభారం కానున్నది.

ఇసుక ద్వారా, మద్యం ద్వారా వచ్చే ఆదాయం ప్రభుత్వ ఖజానాకు గాక ప్రయివేటు వ్యక్తుల జేబుల్లోకి చేరుతోంది. అందుకే ప్రభుత్వ అప్పు రూ.10 లక్షల కోట్లు దాటింది. కేంద్ర ప్రభుత్వ అప్పు రూ.150 లక్షల కోట్లు అయ్యింది. ప్రభుత్వం ఈ దోపిడీ పద్ధతిని కాపాడుకోవడానికి, ప్రజల ఆగ్రహాన్ని కట్టడి చేయడానికి అప్రజాస్వామిక పోలీసు విధానం అమలు చేస్తున్నది. కార్మికులు, రైతులు, మధ్య తరగతి, మైనారిటీల హక్కులను కాపాడుకోవాలన్నా అందరూ కలిసి విశాల ఐక్యతను నిర్మించుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించడానికి ఉద్యమాలు ఉధృతం చేయాలని మహా ధర్నాలో వక్తలు పిలుపునిచ్చారు. రెండు రోజులపాటు జరిగిన ఈ మహా ధర్నా రానున్న ఉద్యమాలకు గొప్ప స్ఫూర్తిని అందించింది.

(వ్యాస రచయిత ఎ.పి రైతు సంఘం అధ్యక్షులు)

కవిత్వం



తేలిక ప్రశ్నలు - లోతైన జవాబులు

మీరేమిటోల్లురా?
దళితులమయ్యా!
అంటే, ఎందులో వస్తారూ?
మీ తిట్లల్ల ఒస్తం
మురికి కాలవల్ల ఒస్తం
విడిగా పెట్టిన కంచంల ఒస్తమయ్య
అంటే-హిందువులు కారా?
ఎందుకు కాం దొర-అయితం-
మీ ఎలక్షన్ లెక్కలల్ల అయితం!

ఏం తింటార్రా మీరూ?
దళితులు తినేవన్నీ తింటం నాయిన
అవే, ఏమేం తింటరు?
మీతో దెబ్బలు తింటం
అప్పుల బాదలు తింటం
మీ తొక్కిసలాటల, మేం తన్నులు తింటం,
ఎప్పుడన్న మీరేశిన తొక్కు దింటం-బాంచెన్!
కోళ్ళు తింటరేమో ననుకున్నారా?
తింటాం గద దొర! మీ ఎలక్షన్ టయిముల-

ఏమేం తాగుతర్రా మీరూ?
దళితులు తాగేవే తాగుతమయ్య
అవే - ఏమిటవి?
అంటరాని నీల్లు తాగుతం
ఇరిగిన కోర్కెల ఇషం తాగుతం
రేపనేది లేని చీకటి తాగుతం
బీరు-బ్రాంది తాగుతారేమోననుకున్నారా?
తాగుతం కద నాయిన -మీ ఎలక్షన్లప్పుడు-

మీకేం దొరుకుతయిరా?
దళితులకు దొరికేవన్నీ దొరక్తయి దొర
అంటే-అదే ఏమేం దొరుకుతయ్?
మీరు ఒదిలేసిన మురికి
ఊరొదిలేసి చివరికి
అందుకున్న కొసప్రానాలు ఉరికి
అదేమిటీ? ఆశలేవీ దొరకవా?
దొరుక్తయి కద దొర-మీ ఎలక్షన్లప్పుడు-

ఇంతకీ మీరు చేసిన పనేంట్రా?
దళితులు చేసే పనులన్నీ చేశినం దొర
అదే-ఏమేం చేశారు?
వంద రోజులు చెరువు పని చేశినం
మా చెమటల్తో దాన్ని నింపేశినం
పగలంత పని చేసి, దాన్నె రాత్రి చేసినం
రాత్రంత పని చేసి, దాంతోనే పొద్దు పొడిపించినం

అవునా? ఇంకేమేం చేశార్రా?
ఆ దారిన ఒచ్చిపోయే మీ దొరలందరికీ
దండాలు పెడ్తం కద నాయిన?
అంతేనా? ఇంకా ఏదో పెద్ద పని
చేశారనుకున్నానే?
చేశినం కద దొర-మీ ఎలక్షన్ ప్రచారం!
అంతకు మించి మాకు, మరో పెద్ద పనేముంటదయ్యా
బాంచెన్ నీ కాల్ మొక్త...

హిందీ మూలం : బచ్చాలాల్ ఉన్మేష్
తెలుగు :డా॥ దేవరాజు మహారాజు

జనవాక్యం

'బంగారు తల్లి' మళ్లీ రావాలి

ఇద్దరు ఆడపిల్లల తల్లిదండ్రులకు గత ప్రభుత్వాలు బాలికా సంరక్షణ పథకాలు, బంగారు తల్లి పథకాలు అని నామకరణాలు చేసి అమలుచేశాయి. వీటి కింద కొంత మంది ఆడపిల్లల తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలకు డిపాజిట్ బాండ్లు కూడా ఏర్పాటు చేశారు. సదరు పథకాలను కొద్దికాలంపాటు కొనసాగించిన దరిమిలా ప్రభుత్వం వారు కొనసాగించడం లేదు. ఏళ్లు గడిచిపోతున్నా ఇంతవరకు దీన్ని గురించి ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. ప్రభుత్వం పేద కుటుంబాల వాస్తవ పరిస్థితులను గుర్తించినట్లయితే ఈ పథకం వలన ఆడపిల్లల తల్లిదండ్రులకు ఎంతో మేలు చేకూరుతుంది. ఆడపిల్లల బంగారు భవిష్యత్తుకు ఎంతగానో తోడ్పడుతుంది. ఇద్దరు ఆడపిల్లల తల్లిదండ్రులకు ఎంతో కొంత మేలు చేకూర్చేలా ప్రభుత్వం తగు సహాయ సహకారాలు అందించాలి. అర్హులకు లబ్ధి చేకూర్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని మరలా ప్రారంభించాల్సిందిగా కోరుతున్నాం.

- యేటూరి రవి కుమార్
షేర్ మహమ్మద్ పేట, యన్.టి.ఆర్ జిల్లా.

మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

తుపాను ధాటికి చెన్నై విలవిల

- ఏడుగురు మృతి
- రూ. 5 వేల కోట్ల సాయం కోరతాం : స్టాలిన్

చెన్నై : మిచౌంగ్ తుపానుతో చెన్నై అతలాకుతలమైంది. గత రెండు మూడు రోజులుగా కుండపోతగా కురిసిన వర్షాలకు పలు ఇళ్లల్లోకి నీరు చేరడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు చెన్నై నగరం తడిసి ముద్దయింది. వర్షాలు సృష్టించిన బీభత్సానికి చెన్నైలో ఏడుగురు చనిపోయారు. వరద నీటిలో మునిగిపోవడం, కరెంట్ షాక్‌లు, గోడలు, చెట్లు కూలడం వంటి కారణాలతో వీరు మరణించారు. అనేక మంది గాయపడ్డారు. తాంబరం, మధుర వాయిల్, ఆవడి తదితర లోతట్టు ప్రాంతాలు దీవులను తలపించాయి. వరదలో చిక్కుకున్నవారిని పడవల ద్వారా సహాయక చర్యల బృందాలు సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. తిరువని సిల్లో ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలో కార్లు నీట మునిగాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లోకి నీళ్లు రావడంతో పై ఫ్లోర్‌కు వెళ్లి తలదాచుకున్నారు. పాలు, ఇతర నిత్యావసరాలు దొరక్క ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షం కొంచెం తగ్గు ముఖం పట్టడంతో ఇళ్లలో నీటిని బయటకు తోడి పోస్తున్నారు. సహాయక శిబిరాల్లో ఉన్నవారికి దుస్తులు, ఆహారం వంటివి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు అందిస్తున్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఈ వర్షముంపు ప్రాంతాలను మంగళవారం పర్యటించి బాధితులను పరామర్శించారు. సహాయక చర్యలు ముమ్మరంగా చేపడుతున్నామని, తొమ్మిది జిల్లాల్లో 61,600 మందిని సహాయక శిబిరాలకు తరలించినట్లు తెలిపారు. వర్షాలకు నగరంలో రవాణా పూర్తిగా స్తంభించింది. రానున్న 24 గంటల్లో వర్షాలు తగ్గుముఖం పట్టవచ్చని భారత వాతావరణ శాఖ (ఐఎండి) పేర్కొంది.



కరపాక్కంలో వరద ముప్పునకు గురైన ప్రాంతం నుంచి సినీ నటులు అమీర్‌ఖాన్, విష్ణు విశాల్, క్రీడాకారిణి జ్వాలా గుత్తాను రక్షిత ప్రాంతానికి తరలిస్తున్న సహాయక సిబ్బంది. తాము వరద నీటిలో చిక్కుకున్నామంటూ సామాజిక మాధ్యమాల్లో విశాల్ పోస్టు చేసిన వెంటనే సహాయక సిబ్బంది వచ్చి కాపాడటంతో రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అమీర్‌ఖాన్‌ను రక్షించిన సహాయక బృందం

బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్‌ను తమిళనాడు ఫైర్ అండ్ రెస్క్యూ సర్వీసెస్ బృందం కరపాక్కంలో పడవ ద్వారా రక్షించారు. అమీర్ ఖాన్ అక్టోబర్ నుంచి చెన్నైలో నివాసం ఉంటున్నారు. నగరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో అమీర్ ఖాన్ తల్లి జీనత్ హుస్సేన్ చికిత్స పొందుతున్నారు. ఇదే ప్రాంతం నుంచి తమిళ నటుడు విష్ణు విశాల్, జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి జ్వాలా గుత్తాను కూడా సహాయక బృందాలు రక్షించాయి.

కూవమ్ నది ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో పరిసర ప్రాంతాల్లోకి భారీగా నీరు చేరింది. వరద ప్రభావం తగ్గిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను అధికారులు పునరుద్ధరించారు. భారీ వర్షాల కారణంగా మూసివేసిన చెన్నై ఎయిర్‌పోర్టును వర్షాలు కాస్త తెరిపినివ్వడంతో రన్‌వేపై నీటిని అధికారులు తొలగించారు.. చెన్నైతో పాటు కాంచీపురం, తిరువళ్లూరు, చెంగల్పట్టు జిల్లాల్లోనూ తుపాను ప్రభావం ఎక్కువగా ఉంది.

భారీ వర్షాల కారణంగా జరిగిన నష్టం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి రూ 5 వేల కోట్ల మధ్యంతర సహాయాన్ని కోరతామని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తెలిపారు. ఎప్పుడూ లేని విధంగా కురిసిన వర్షాలతో నివాస ప్రాంతాలు, రోడ్లు దెబ్బతిన్నాయని వీటికి మరమ్మతులు అవసరం అని స్టాలిన్ తెలిపారు. రూ 5 వేల కోట్ల కోసం కేంద్రానికి లేఖ రాస్తాం, రాష్ట్ర ఎంపిలు దీనిపై పార్లమెంట్‌లో మాట్లాడతారని అన్నారు. అలాగే ప్రభుత్వం తీసుకున్న ముందుజాగ్రత్త చర్యలు, వేగవంతమైన సహాయక చర్యలు కారణంగా ప్రాణనష్టం, ఇతర సమస్యలు గణనీయంగా తగ్గాయని అన్నారు.

డిఎంకె సభ్యులు మంగళవారం పార్లమెంటు సమావేశాల్లో వరద సమస్యను లేవనెత్తారు. మధ్యంతర సహాయంగా రూ. 5 వేల కోట్లు అందించాలని కేంద్రాన్ని కోరారు. అలాగే, కేంద్ర బృందం తమిళనాడులో పర్యటించి తుపాను వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని డిమాండ్ చేశారు.

లోక్‌సభలో ఎంపి టీఆర్ బాలు జీరో అవర్‌లో ఈ అంశాన్ని లేవనెత్తారు. రాజ్యసభలో ఎంపి తిరుచ్చి శివ మాట్లాడుతూ దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను పునర్నిర్మించడానికి, ప్రజలకు ఉపశమనం కలిగించడానికి మధ్యంతర సాయం అందించాలని కోరారు.

బడా పరిశ్రమలకే బ్యాంక్ రుణాల మాఫీ

- లోక్‌సభకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ : గత ఐదు సంవత్సరాల కాలంలో బ్యాంకులు రూ.10.6 లక్షల కోట్ల మేర రుణాలు మాఫీ చేశాయి. అయితే వీటిలో సగానికి పైగా బడా పరిశ్రమలు, సేవల రంగానికి సంబంధించిన రుణాలే ఉన్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో వాణిజ్య బ్యాంకులు రూ.2.09 లక్షల కోట్ల మేరకు రుణాలను మాఫీ చేశాయి. ఇందులో 52.3% లేదా రూ.1.9 కోట్లు బడా పరిశ్రమలు, సేవల రంగానివేనని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కరద్ లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలియజేశారు. బ్యాంకుల నుండి రూ.5 కోట్లు, ఆ పైన రుణాలు తీసుకున్న 2,300 మంది రెండు లక్షల కోట్ల రూపాయల మేర బకాయి పడ్డారని కూడా ఆయన చెప్పారు. రుణాలు ఎగవేసిన కార్పొరేట్ సంస్థల పేర్లు వెల్లడించాలంటూ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ రుణమాఫీ చేసిన కంపెనీల పేర్లు బయటపెట్టకూడదని ఆర్‌బీఐ నిబంధనలు నిర్దేశిస్తున్నాయని తెలిపారు. రుణాల చెల్లింపులో జాప్యం చేసిన వారి నుండి బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు వసూలు చేసిన జరిమానా ఛార్జీల వివరాలు తెలపాలని కోరగా ఆ వివరాలు తన వద్ద లేవని ఆర్‌బీఐ చెప్పిందని వివరించారు. అయితే గడచిన ఆర్థిక సంవత్సరంలో పెనాల్టీలు సహా ఇతర ఛార్జీల రూపంలో బ్యాంకులు రూ.5,309.80 కోట్లు వసూలు చేశాయని ఆర్‌బీఐ సమాచారాన్ని ఉటంకిస్తూ మంత్రి తెలియజేశారు.

కాగా సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన వివరాల ప్రకారం ఆర్‌బీఐ సమాచారం మేరకు 2012-13 నుండి బ్యాంకులు రూ.15,31,453 కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేశాయని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక తెలిపింది. గత మూడు సంవత్సరాల కాలంలో బ్యాంకులు రూ.5.87 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేయగా అందులో కేవలం రూ.1.09 లక్షల కోట్లు మాత్రమే రాబట్టగలిగాయి. అంటే రద్దు చేసిన రుణాలలో ఇది 18.60% అన్న మాట. పన్ను ఎగవేతదారులతో రాజీ కుదుర్చుకోవాలని ఆర్‌బీఐ చేసిన సూచనను బ్యాంకులు వ్యతిరేకించాయి.

నేడు 'ఇండియా' ఫోరం సభాపక్ష నేతల భేటీ

న్యూఢిల్లీ : బిజెపియేతర ప్రతిపక్షాల ఐక్య వేదిక 'ఇండియా' ఫోరం అధినేతల సమావేశం డిసెంబరు మూడో వారానికి వాయిదా పడింది. ఇదివరకు ప్రకటించిన షెడ్యూలు ప్రకారం ఈ నెల 6న బుధవారం నాడు కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే నివాసంలో ఈ సమావేశం జరగాల్సివుంది. అయితే 'ఇండియా' ఫోరంలోని పక్షాలకు సంబంధించిన పార్లమెంటరీ పార్టీ నేతలు బుధవారం సాయంత్రం 6 గంటలకు ఖర్గే నివాసంలో సమావేశమవుతారు. ఆ తర్వాత ఫోరంలోని పార్టీ అధ్యక్షులు, అధినేతల సమావేశం డిసెంబరు మూడో వారంలో నిర్వహించనున్నట్లు ఖర్గే కార్యాలయ సమన్వయకర్త గురుదీప్ సప్పాల్ ట్విట్టర్‌లో పోస్టు చేశారు. సమావేశ తేదీని నేతలందరికీ అనువైన సమయాన్ని చూసి నిర్ణయించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇదివరకే ఖరారు అయిన షెడ్యూల్‌కు సమయం కేటాయించినందున బుధవారం సమావేశానికి తాము హాజరుకాలేమని టిఎంసి అధ్యక్షులు మమతా బెనర్జీ ప్రకటించడం.. ఎస్‌పి అధ్యక్షులు అఖిలేష్ యాదవ్‌కు తమకు సమాచారం లేదని..హాజరయ్యేది లేనిది నిర్ణయించలేదని పేర్కొన్నారు. అలాగే తుపాను కారణంగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్, అనారోగ్య కారణాల రీత్యా బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ కూడా బుధవారం నాటికి హాజరు కాలేమని తెలిపారు. ఈ నేపథ్యంలో ఫోరం అగ్రనేతల సమావేశాన్ని వాయిదా వేయడం అనివార్యమైనట్లు తెలుస్తోంది.

రోజుకు 31 మంది అన్నదాతల ఆత్మహత్య

- 2022లో 11,290 బలవన్మరణం
- వీరిలో 6083 మంది వ్యవసాయ కార్మికులే

న్యూఢిల్లీ : దేశంలో అన్నదాతల బలవన్మరణాలు ఏటికేడు పెరుగుతూనేవున్నాయి. జాతీయ నేర రికార్డుల సంస్థ (ఎన్‌సిఆర్‌బి) ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం సగటున ప్రతి రోజూ 31 మంది అన్నదాతలు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఎన్‌సిఆర్‌బి నివేదిక ప్రకారం 2022లో వ్యవసాయ రంగంలో 11,290 మంది ఆత్మహత్య చేసుకున్నారు. వీరిలో 5,207 మంది రైతులు కాగా 6,083 మంది వ్యవసాయ కార్మికులు ఉన్నారు. 2021తో పోలిస్తే గత ఏడాదిలో ఆత్మహత్యలు 3.75 శాతం పెరిగినట్లు నివేదిక తెలిపింది. 2021లో 10,881 మంది కర్షకులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరిలో 5,318 మంది రైతులు, 5,563 మంది వ్యవసాయ కార్మికులున్నారు. రైతులు కంటే వ్యవసాయ కార్మికులు ఎక్కువగా ఆత్మహత్యకు పాల్పడటం 2020 తరువాత పెరుగుతూవస్తోంది. 2020లో వ్యవసాయ రంగంలో 10,677 మంది ఆత్యహత్యకు పాల్పడ్డారు. వీరిలో 5,579 మంది రైతులు కాగా, 5,098 మంది వ్యవసాయ కార్మికులు. 2019లో వ్యవసాయరంగంలో మొత్తంగా 10,281 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరిలో 5,957 మంది రైతులు, 4,324 మంది వ్యవసాయ కార్మికులు. అంతకు ముందు ఏడాది అంటే 2018లో మొత్తంగా 10,349 మంది ఆత్యహత్యకు పాల్పడ్డారు. వీరిలో 5,763 మంది రైతులు, 4,586 మంది వ్యవసాయ కార్మికులున్నారు.



నారాయణ్ బిశ్వాస్‌కు నివాళులర్పిస్తున్న బిమన్‌బసు, సూర్యకాంత్ మిశ్రా తదితరులు (ఇన్‌సెట్‌లో నారాయణ్ బిశ్వాస్ ఫైల్ ఫొటో)

సిపిఐ(ఎం) సీనియర్ నేత నారాయణ్ బిశ్వాస్ కన్నుమూత

కొల్‌కతా : సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు, పశ్చిమ బెంగాల్ మాజీ మంత్రి నారాయణ్ బిశ్వాస్ (67) మంగళవారం ఉదయం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన స్థానిక ఎస్ఎస్‌కెఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో తుదిశ్వాస విడిచారు. నారాయణ్ బిశ్వాస్ మృతితో దినాజ్‌పూర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. 70వ దశకంలో రైతు ఉద్యమంలో పాలుపంచుకున్న నారాయణ్ బిశ్వాస్.. ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీలో చేరి అనేక ప్రజా ఉద్యమాల్లో కీలక భూమిక పోషించారు. 2001-2011 మధ్యన బుద్ధదేవ్ భట్టాచార్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నారాయణ్ బిశ్వాస్ మంత్రిగా పనిచేశారు. 1975లో ఎమర్జెన్సీ సమయంలో అజ్ఞాతంలో ఉన్నారు. 1980లో గంగారాంపూర్ సిపిఐ (ఎం) ప్రాంతీయ కమిటీ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2001లో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి చిన్న, కుటీర పరిశ్రమల శాఖ సహాయ మంత్రిగా, 2006లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా, పశు వనరుల అభివద్ధి శాఖకు పూర్తిస్థాయి మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2015 నుంచి దక్షిణ్ దినాజ్‌పూర్ సిపిఐ(ఎం) జిల్లా కమిటీకి మూడుసార్లు కార్యదర్శిగా ఎన్నికై మరణించే వరకు ఆ బాధ్యతను నిర్వర్తించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులుగానూ పనిచేశారు. రైతులు, కార్మికుల ప్రజా ఉద్యమాన్ని నడిపించడంలో చురుకైన పాత్ర పోషించారు. ప్రజా సందర్శనార్థం ఆయన మృతదేహాన్ని ఎస్ఎస్‌కెఎం ఆసుపత్రి నుంచి తరలించి అలీముద్దీన్ వీధిలోని సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో ఉంచారు. లెఫ్ట్‌ఫ్రంట్ ఛైర్మన్, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బిమన్ బసు, మరో పొలిట్ బ్యూరో సభ్యులు సూర్యకాంత్ మిశ్రా, కేంద్ర కమిటీ సభ్యులు శ్రీదీప్ భట్టాచార్య, 'గణశక్తి' బాధ్యులు షామిక్ లాహిరి, తదితరులు నారాయణ్ బిశ్వాస్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. బుధవారం ఉదయం 11 గంటలకు మాల్దాలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు మృతదేహాన్ని అప్పగించనున్నారు.




మీకోసం

మీ కోసం
లవంగం పొడిని గుడ్డలో చుట్టి వాసన పీలుస్తూ ఉంటే తలనొప్పి తగ్గుతుంది.

జీవన సౌరభం

విమర్శిస్తున్నారని, విఫలమయ్యామని ప్రయత్నాలు ఆపేసి ఉంటే ఇన్ని అద్భుతాలు సాధించేవాళ్లం కాదు.

ఆకాశం



అదిగో అదిగో ఆకాశం
అందమైన ఆకాశం
ఎంతో చక్కని ఆకాశం
ఇంకెంతో చల్లని ఆకాశం

తెల్లని మబ్బుల ఆకాశం
ఆహ్లాద పరిచే ఆకాశం
నీలి నీలి నీలాకాశం
నింగికి మాత్రం దూరం

నల్లని మబ్బుల్లో జోరున
వర్షాలు కురిపించే ఆకాశం

సూర్య చంద్రుల ఆకాశం
నక్షత్రాల నిలయం ఆకాశం
అంతరిక్షంలో ఆకాశం
విజ్ఞాన పరిశోధన ఆకాశం

అందమైన ఆకాశం
నల్లని చీకట్లో వెన్నెల ఆకాశం
గ్రహాలకు కొలువైన
అద్భుతమైన ఆకాశం!

ఇంద్ర ధనుస్సు వీక్షించే
అందమైన ఆకాశం

- ఎల్. ప్రఫుల్ల చంద్ర,
630054670

సరిచేసి రాయండి

పిల్లలూ, ఇక్కడ తికమకగా ఉన్న అక్షరాలను సరిచేసిరాస్తే అర్థవంతమైన పదాలు వస్తాయి. ఒకటి మేము ఇచ్చాం. మిగతావి మీరు ట్రై చేయండి

ఉదా : రఅక అరక

లబత	-----------	రంణరగం	-----------
డవప	-----------	దంగంమ్మ	-----------
జనవ	-----------	రువతే	-----------
రంగన	-----------	మలంక	-----------
ఆదంనం	-----------	రుకంమథ	-----------

నేను గీసిన బొమ్మ





పి. రామ్ చరణ్,
6వ తరగతి,
జెడ్‌పిహెచ్ఎస్, కుల్చారం,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పర్యావరణ పరిరక్షణ కోసం...

పర్యావరణ పరిరక్షణకు అడవులు, వాటిలోని మొక్కలు ఎంతగానో దోహదం చేస్తాయి. అలాంటి అడవుల పరిరక్షణ కోసం కర్ణాటక రాష్ట్రం మంగుళూరుకు చెందిన పర్వతారోహకుడు, పర్యావరణ వేత్త జీత్‌మిలన్ రోచె కృషి చేస్తున్నారు. అంతరించిపోతున్న అడవులను కాపాడేందుకు తనవంతుగా పాటుపడుతున్నారు. రోచె నేతృత్వంలోనే కంఠవరంలో వన చారిటబుల్ ట్రస్ట్ అటవీ సంరక్షణ ప్రాజెక్టును చేపట్టింది. దీనికి అటవీశాఖ సహకారం అందిస్తోంది. క్రమేపి తగ్గిపోతున్న అడవులను పచ్చదనంగా మార్చేందుకు మొక్కలు నాటడం, అడవులను శుభ్రం చేయటంలో జీత్ వాలంటీర్లు, పర్యావరణ వేత్తలు సహకారం అందిస్తున్నారు.



మంగుళూరు పరిసర ప్రాంతాల్లో పరిశ్రమలు ఎక్కువగా ఉండటం, పట్టణీకరణ, నగరీకరణల నేపథ్యంలో అడవుల విస్తీర్ణం తగ్గిపోతోంది. మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులు, వాణిజ్య అభివృద్ధి పేరుతో ఏళ్లతరబడి చెట్లు నరికివేయబడుతున్నాయి. ఈ క్రమంలో గతంలో వినిపించిన పక్షుల కిలకిలారావాలు మూగబోతున్నాయి. అడవిలో జంతువులు తమ ఆవాసాలను కోల్పోయాయి. ఇలాంటి పరిస్థితులను స్వయంగా చూసి, తెలుసుకున్న పర్యావరణ వేత్త జీత్‌మిలన్ రోచె, మంగుళూరు నగరానికి పచ్చని తోరణం తేవాలని భావించారు. అదే క్రమంలో మొక్కలు నాటేందుకు, పచ్చదనం ఉద్యమం ముందుకు సాగే ఆలోచనలు చేయాలని భావించారు. ప్రపంచవ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతున్న కాలుష్యం, క్షీణిస్తున్న పర్యావరణ పరిస్థితులను తెలుసుకున్న రోచె 2004లో తన కార్పొరేట్ ఉద్యోగాన్ని వదిలిపెట్టారు. ఎలాంటి ప్రత్యేక ప్రణాళికలు లేకుండానే పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడానికి బయలుదేరారు. చుట్టూ కనిష్టంగా ఉన్న పచ్చదనాన్ని గమనించి ఒక్కో మొక్కను నాటడాన్ని ప్రారంభించారు. ఈ విధంగా ప్రారంభించిన ప్రయాణంలో మరికొందరు చేరటంతో ఆయనకు మరింత బలం చేకూరింది. అంతరించిపోతున్న అటవీ విస్తీర్ణాన్ని విస్తరించాలనే అభిరుచి అందరికీ వంటబట్టడంతో 'పర్యావరణం... పచ్చదనం.. అడవిని విస్తరిద్దాం' నినాదంతో ముందుకు సాగారు. వందలు, వేలల్లో మొక్కలు నాటుతున్నారు.

మంగుళూరుకు పచ్చని శోభ



2004 నుంచి ప్రారంభమైన ఈ పచ్చనియజ్ఞం 2016 నాటికి ఉధృతి రూపు దాల్చింది. మంగుళూరు చుట్టూ మొక్కలు పెద్దఎత్తున నాటడంతో హరితవనంలా మారింది. రోసె 2 లక్షల మొక్కలు నాటారు. ఏటేటా సుమారు 12 వేల చెట్లు, పాఠశాలలు, శ్మశాన వాటికలు, చుట్టుపక్కల డంపింగ్‌యార్డులు, నిర్మానుష్యంగానూ, భయానకంగా ఉండే శ్మశాన వాటికల వరకూ వెళ్లి మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టారు. మంగుళూరు నగరం ఇప్పుడు పచ్చటితోరణంగా ఎటుచూసిన మొక్కలు, చెట్లతో అలరారుతోంది. చెట్లు పెరగటానికి సురక్షితమైన ప్రదేశాలు శ్మశానవాటికలని చెబుతారు రోచె. 'నేను 20 శ్మశాన వాటికల్లో 8000 మొక్కలను నాటాను. అక్కడ మానవ జోక్యం లేకపోవటంతో అవి సురక్షితంగా ఉంటున్నాయి.' అని పేర్కొన్నారు. 2020లో ప్రపంచం మొత్తం కరోనాతో అల్లాడుతున్నప్పుడు కూడా రోచె పచ్చనాడి డంప్‌యార్డులో 3000 మొక్కలను నాటారు. రోచెకు పర్యావరణ ఇంజనీర్ మధు కూడా సహకరించారు. ఇలా మొక్కలు నాటడంతో గ్రీన్ కవర్ దుర్వాసన తగ్గటానికి దోహదపడుతుందని వారు అంటున్నారు.

కంఠవరాన్ని కాపాడుతున్నారు

ఉడిపి జిల్లాలోని కర్కల తాలూకాలోని రిజర్వు ఫారెస్ట్ కంఠవరంలో వన చారిటబుల్‌ట్రస్ట్, రోచె నేతృత్వంలోని అటవీ సంరక్షణ ప్రాజెక్టును చేపట్టింది. దేశంలో అడవులు తగ్గిపోతుండటం, క్షీణిస్తున్న అడవుల పరిరక్షణ, పునరుద్ధరణ గురించి పిల్లలు, ఉపాధ్యాయులు, ప్రజలకు అవగాహన కల్పించటమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. అటవీశాఖ సహకారంతో పనిచేస్తూనే లోపల అడవిలో కార్యకలాపాలపై నిఘా ఉంచుతుంది. ఉల్లంఘనలు ఏమైనా ఉంటే అటవీశాఖకు ట్రస్ట్, ప్రాజెక్టు ప్రతినిధులు తెలియజేస్తుంటారు. 'అడవుల్లో ఎవరైనా చెట్లను నరకటం, జంతువులను వేటాడటం, ఆక్రమించుకోవటం వంటివి చూసినప్పుడు స్థానికంగా నివసించే వారు మమ్మల్ని అప్రమత్తం చేస్తారు. వారు మాకు లొకేషన్ పంపుతారు. మేము వెంటనే అటవీశాఖకు సమాచారం అందిస్తామని రోచె తెలిపారు. కంఠవరలో పరిరక్షణ ప్రాజెక్టులో భాగంగా అడవుల ప్రాముఖ్యత- వాటి పరిరక్షణ గురించి మరింతగా తెలుసుకోవటానికి చాలా ప్రాంతాల నుంచి కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు సైతం వస్తున్నారు. వాలంటీర్ గ్రూపులు కూడా వారాంతాల్లో కంఠవర బేస్ క్యాంపులకు వస్తున్నారు. వారికి భోజనం, బస, ఇతర ఏర్పాట్లు నిర్వాహకులు చేస్తున్నారు. ఆయా బృందాలకు స్థానికులు, అటవీశాఖ ద్వారా అడవుల ప్రాముఖ్యత, వాటిని ఎలా పునరుద్ధరించాలిపై అవగాహన కల్పిస్తున్నారు. అడవులను శుభ్రపర్చటం, చెట్ల పెంచటం కార్యకలాపాల్లో కూడా వారు పాలు పంచుకుంటున్నారు.

తుపాను వేళ ... తీసుకోవాల్సిన జాగ్రత్తలు

నవంబరు, డిసెంబరు నెలల్లో మనకు తుపానులు వస్తుంటాయి. విపరీతమైన చలివాతావరణంతో పాటుగా చలిగాలులు వీస్తుంటాయి. ఇలాంటి సందర్భాల్లో మనం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

ఇళ్లల్లో ఉన్న వారైతే...

- ఇంట్లోని ఎలక్ట్రికల్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి.
- అన్ని ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ ఉపకరణాలు, గ్యాస్ కనెక్షన్లను ఆపేయాలి.
- తలుపులు, కిటికీలు మూసి ఉండాలి
- వేడిచేసిన, క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే తాగాలి.
- వాతావరణశాఖ తెలిపే అధికారిక సమాచారాన్ని తెలుసుకోవాలి. ఇతరత్రా ప్రచారాలను నమ్మకూడదు.
- మొబైల్ ఫోన్లకు ఛార్జింగు అయిపోకుండా జాగ్రత్త పడాలి.
- విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున ముందుగానే ట్యాంకు నింపుకోవాలి. వాష్‌రూముల్లో ఒకటి, రెండు బకెట్లలో నీరు నింపుకొని ఉండాలి.
- సాధారణ విద్యాసంస్థలకు సెలవులు ఇస్తారు. అలా ఇవ్వని సందర్భం ఉంటే- భారీ వర్షాలు ఉన్న రోజుల్లో పిల్లలను స్కూళ్లకు పంపకుండా ఉండడమే మంచిది.

బయట ఉంటే...

- దెబ్బతిన్న పాత భవనాల్లోకి వెళ్లొద్దు.
- వీలైనంత త్వరగా సురక్షితమైన షెల్టర్లు, భవనాల్లోకి చేరుకోవాలి.
- వర్షం వస్తుందని చెట్లు, విద్యుత్ స్తంభాలకు దగ్గరగా ఆగకూడదు.
- వర్షం నీరు పారుతున్న రోడ్ల మీద ప్రయాణించరాదు. ఒకవేళ ప్రయాణించాల్సి వస్తే చాలా అప్రమత్తంగా ఉండాలి.
- బయట ఆహార పదార్థాలు తినకుండా, నీరు తాగకుండా ఉండడం మంచిది.

తుపాను తర్వాత ...

- వేడిచేసిన, క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే తాగాలి
- విరిగిన విద్యుత్ స్తంభాలు, వదులుగా ఉండే కరెంట్ తీగలు, తెగిన తీగలు పట్ల అప్రమత్తంగా ఉండాలి



దాణా రవాణాపై నిషేధం రైతు వ్యతిరేక చర్య

- కేరళ ఎల్‌డిఎఫ్ కన్వీనర్ ఇపి జయరాజన్ విమర్శ

తిరువనంతపురం : కర్ణాటక నుంచి కేరళకు పశు దాణా, పచ్చి మేత రవాణా చేయడాన్ని నిషేదిస్తూ కర్ణాటక ప్రభుత్వం ఇటీవల తీసుకున్న చర్య రైతాంగ వ్యతిరేకమని వామపక్ష ప్రజాతంత్ర కూటమి (ఎల్‌డిఎఫ్) కన్వీనర్ ఇపి జయరాజన్ విమర్శించారు. కర్ణాటక ప్రభుత్వ చర్యను నిరసిస్తూ హస్సన్ జిల్లాలోని మూల్‌హల్లి సమీపంలో కర్ణాటక - కేరళ సరిహద్దు ప్రాంతంలో ఎల్‌డిఎఫ్ ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టారు. వందలాది మంది రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయరాజన్ మాట్లాడుతూ కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం దాణాపై నిషేదం విధిస్తూ తీసుకున్న నిర్ణయం వల్ల అక్కడి కార్పొరేట్ కంపెనీలకే లబ్ధి చేకూరుతుందని, రైతులకు, ప్రధానంగా పాడి పరిశ్రమ రైతులకు, మొక్క జొన్న రైతులకు ఈ చర్య తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని తెలిపారు. ఇరు రాష్ట్రాల మధ్య ఈ సమస్యను పరిష్కరించేదిశగా కాంగ్రెస్ నేత, కేరళ ఎంపి రాహుల్ గాంధీ ఇప్పటి వరకూ కనీసం నోరు కూడా మెదపడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఈ నిషేదాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ త్వరలోనే ఎల్‌డిఎఫ్ నేతల బృందం బెంగళూరుకు వెళ్లి సంబంధిత మంత్రులకు వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. దీంతో పాటు కోజికోడ్ - కొల్లాగెల్ జాతీయ రహదారి 766 పై కర్ణాటక ప్రాంతంలో రాత్రి వేళ ట్రాఫిక్‌పై కూడా కర్ణాటక ఆంక్షలు విధించింది. ఈ రెండు చర్యలు వల్లా అటు కేరళ, ఇటు కర్ణాటక ప్రజలు ఇరువురు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై రాహుల్ పట్టించుకోవడం లేదని జయరాజన్ విమర్శించారు.

భూకక్ష్యలోకి ప్రొపల్షన్ మాడ్యూల్ : ఇస్రో

న్యూఢిల్లీ : చంద్రయాన్ -3 ప్రొపల్షన్ మాడ్యూల్ కక్ష్యను విజయవంతంగా మార్చామని ఇస్రో మంగళవారం ప్రకటించింది. చంద్రుడి కక్ష్య లో ఉన్న మాడ్యూల్ ను భూకక్ష్యలోకి తీసుకొచ్చే అరుదైన ప్రయోగంలో విజయవంతమయ్యామని తెలిపింది. ఇందుకు గాను ఒక కక్ష్య పెంపు విన్యాసం, ఒక ట్రాన్స్-ఎర్త్ ఉత్తేజిత ప్రక్రియ వినియోగించినట్లు తెలిపింది. జియోస్టేషనరీ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జిటిఒ) నుండి చివరి చంద్ర ధ్రువ వృత్తాకార కక్ష్యకు ల్యాండర్ మాడ్యూల్‌ను మార్చడం మరియు ఉద్దేశించిన విధంగా విభజనను విజయవంతంగా సాధించడం ద్వారా ప్రొపల్షన్ మాడ్యూల్ (పిఎం) ప్రధాన లక్ష్యం నెరవేరిందని ఇస్రో వెల్లడించింది. విభజన తరువాత ఇస్రో పిఎం లోపల హాబిటబుల్ ప్లానెట్ ఎర్త్ (ఎస్‌హెచ్‌ఎపిఇ) పెలోడ్ స్పెక్ట్రోపోలారిమెట్రీని నిర్వహించిందని ప్రకటించింది. వాస్తవానికి ఎంపి మిషన్‌ను మూడు నెలల ఆపరేషన్ కోసం నిర్ణయించారు. ఒక నెల కంటే ఎక్కువ సమయం మాత్రమే పనిచేయడంతో 100 కిలోల ఇంధనం మిగిలిపోయిందని తెలిపింది. మిగులు ఇంధనాన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో చంద్రయాన్ మిషన్‌ల కోసం అదనపు డేటాను సేకరించేందుకు మరియు భవిష్యత్ నమూనా రిటర్న్ మిషన్‌ల కార్యాచరణను రూపొందించేందుకు దీనిని వినియోగించుకోవాలని నిర్ణయించినట్లు ఇస్రో ప్రకటించింది.

పాయల్, ఆకాన్ష, నిషాకు స్వర్ణాలు

ప్రపంచ జూనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్

యెరెవాన్(ఆర్మేనియా): ప్రపంచ జూనియర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు స్వర్ణాల పంట పండించారు. అంతర్జాతీయ బాక్సింగ్ అసోసియేషన్(ఐబిఏ) ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో పాయల్ (48 కిలోలు), నిషా (52 కిలోలు), ఆకాన్ష (70కిలోలు) స్వర్ణపతకాలు సాధించారు. మంగళవారం జరిగిన 48 కిలోల విభాగం ఫైనల్లో పాయల్.. అర్మేనియాకే చెందిన పెట్రోసియన్‌ను చిత్తుచేసి భారత్‌కు తొలి బంగారు పతకాన్ని ఖాయం చేసింది. ఇక 52 కిలోల విభాగంలో ఆసియా యూత్ ఛాంపియన్ నిషా.. 5-0 తేడాతో తజకిస్తాన్‌కు చెందిన అబ్దుల్లా ఓయేవా ఫరినోజ్‌పై విజయం సాధించింది. మరో పోటీలో ఆకాన్ష కూడా 5-0 తేడాతో రష్యాకు చెందిన తైమజోవాను చిత్తుచేసింది. ఇక బాలికల విభాగంలో విని(57 కిలోలు), సృష్టి(63 కిలోలు), మేఘ(80 కిలోలు) ఫైనల్లో ఓడి రజత పతకాలతో సరిపుచ్చుకున్నారు. ఇక పురుషుల విభాగంలో సాహిల్ (75 కిలోలు), హేమంత్ (80 కిలోలు), జతిన్ (54 కిలోలు) రజతాలకే పరిమితమయ్యారు. సాహిల్ 0-5తో ఓటమిపాలవ్వగా.. 54కిలోల విభాగంలో జతిన్ 1-4తో ఉత్కంఠపోరులో కజకిస్తాన్ బాక్సర్ చేతిలో ఓడాడు. మొత్తం 26మందితో టోర్నమెంట్ బరిలోకి దిగిన భారత్ మూడు స్వర్ణాలు, తొమ్మిది రజతాలు, ఐదు కాంస్య పతకాలతో సహా మొత్తంగా 17 పతకాలతో రెండోస్థానంతో ముగించింది.



పతకాలు సాధించిన భారత బాక్సర్ల బృందం..
బాలికల విభాగం: స్వర్ణాలు: పాయల్(48కిలోలు), నిషా(52), ఆకాన్ష(70)
రజతాలు : అమిషా(54), విని(57), సృష్టి(63), మేఘ(80), ప్రచి టోకాస్(80+)
కాంస్యం :నేషా(46), పారి(50), నిధి ధృల్(66), కృతిక(75)
బాలుర విభాగం : రజతాలు : జతిన్(54), సాహిల్(75), హార్దిక్ పన్వార్(80), హేమంత్(80+) కాంస్యం : సికందర్(48)

అరైజిత్ హ్యాట్రిక్

ప్రపంచకప్ జూనియర్ హాకీలో భారత్ బోణీ



కౌలాలంపూర్: ప్రపంచకప్ జూనియర్ హాకీలో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ బోణీ కొట్టింది. గ్రూప్-సిలో భాగంగా మంగళవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో అరైజిత్‌సింగ్ హ్యాట్రిక్ గోల్స్‌తో చెలరేగడంతో భారత్ 4-2గోల్స్ తేడాతో దక్షిణ కొరియాను చిత్తుచేసింది. అరైజిత్‌సింగ్ 11, 16, 41వ ని.లో గోల్స్ కొట్టగా.. అమన్‌దీప్ 30వ ని.లో మరో గోల్ చేశాడు. ఇక కొరియా తరపున లిమ్(38వ ని.), కిమ్ (45వ ని.)లో ఒక్కో గోల్ కొట్టారు. ఇదే గ్రూప్‌లో ఉన్న స్పెయిన్ జట్టు 7-0తో కెనడాను చిత్తుచేసింది. దీంతో ఈ గ్రూప్‌లో స్పెయిన్, ఇండియా మూడేసి పాయింట్లతో టాప్‌లో కొనసాగుతున్నాయి. ఇక గ్రూప్-ఏలో అర్జెంటీనా 1-0తో ఆస్ట్రేలియాను చిత్తు చేయగా.. గ్రూప్-బిలో జర్మనీ 5-3గోల్స్‌తో దక్షిణాఫ్రికాపై, ఫ్రాన్స్ 3-1గోల్స్‌తో ఈజిప్టును ఓడించాయి.



గుజరాత్ హ్యాట్రిక్

యు ముంబపై గెలుపు

ప్రొ కబడ్డీ సీజన్-10

అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ సీజన్-10లో గుజరాత్ జెయింట్ హవా కొనసాగుతోంది. ఈ సీజన్‌లో గుజరాత్ వరుసగా మూడో మ్యాచ్‌లోనూ నెగ్గి హ్యాట్రిక్ విజయాలతో దూసుకెళ్తోంది. మంగళవారం జరిగిన పోటీలో గుజరాత్ జట్టు 39-37పాయింట్ల తేడాతో యు ముంబపై విజయం సాధించింది. చివరి 2 నిమిషాల్లో వ్యవధిలో ఇరుజట్లు 36-36పాయింట్లతో సమంగా ఉన్న దశలో గుజరాత్ రైడర్ సోను మూడు పాయింట్లు సాధించి గుజరాత్ గెలుపులో కీలకపాత్ర పోషించాడు. గుజరాత్ జట్టులో రైడ్స్‌లో రాకేష్(9), రోహిత్ గులియ(7)పాయింట్లు సాధించగా.. ట్యాకిల్స్‌లో కెప్టెన్ ఫజల్ అత్రచలి మెరిసాడు. ఇక యు ముంబలో గుమన్ సింగ్(10), జఫర్‌డోనేష్ ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిచాడు. నేడు తెలుగు టైటాన్స్-పట్నా పైరెట్స్, యుపి యోధా, హర్యానా స్టీలర్స్ జట్ల మధ్య పోటీలు జరగనున్నాయి.



వరద బాధితులకు రూ.10 లక్షల సాయం

గత కొద్ది రోజులుగా తమిళనాడులో భారీగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తంగా మారిపోయింది. ప్రస్తుత పరిస్థితుల్లో హీరో సూర్య, ఆయన తమ్ముడు కార్తీ వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. ఇద్దరూ కలిసి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించారు.

మీలా మేం సురక్షితంగా లేం..: విశాల్

2015లో వర్షానికి చెన్నై నగరం పూర్తిగా స్తంభించిందని, ఇప్పుడు కూడా పరిస్థితి అదేవిధంగా ఉందని సినీ నటుడు విశాల్ ఆవేదన వ్యక్తం చేశారు. మీలా మేం సురక్షితంగా లేం, వెంటనే పరిస్థితులను మెరుగుపరచాలని చెన్నై మేయర్ ప్రియా రాజన్, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్, ఇతర అధికారులను కోరారు.

వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్

- నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ : ఎన్‌పిఎలపై ప్రశ్నలు అడిగే ముందు, దేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా గుర్తించాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతా రామన్ అన్నారు. రాజ్యసభలో 'దేశంలో ఆర్థిక పరిస్థితి'పై చర్చ జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. నిరర్థక ఆస్తుల (ఎన్‌పిఎ) నిర్వహణపై లేవనెత్తిన ప్రతిపక్ష ఎంపిలు, దేశం ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందు తున్న ఆర్థిక వ్యవస్థ అని మొదట గుర్తించాలన్నారు. '2004-2014 మధ్య 10 సంవత్సరాల యుపిఎ పాలనలో అర్హత లేని వ్యక్తులకు రుణాలు మంజూరు చేశారని అన్నారు. సంస్కరణలతో భారతీయ బ్యాంకులను క్రమబద్ధీకరించే భారం తమపై పడిందని ఆమె అన్నారు.

జిడిపి రెట్టింపు అవుతుందా? : చిదంబరం

'అమృత్ కాల కాలంలో జిడిపి రెట్టింపు అవుతుందా అని కాంగ్రెస్ నేత పి చిదంబరం ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం ఎవరి కోసం ఉందని ప్రశ్నించారు. ఇది పేదల కోసమా? లేక ధనికుల కోసమా ? అని నిలదీశారు. 'దేశంలో ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని, ఈ ధోరణి ప్రమాదకరమని ఆయన అన్నారు.

ఆసియా కరెన్సీలో రూపాయి అధ్వానంగా ఉంది : విజయసాయి రెడ్డి

వైసిపి నేత విజయసాయి రెడ్డి మాట్లాడుతూ.. 2022లో రూపాయి విలువ అత్యంత అధ్వానంగా ఉందని అన్నారు. 'అనేక సమస్యలు దేశ ఆర్థిక వృద్ధికి ఆటంకం కలిగిస్తూనే ఉన్నాయి. 2022లో రూపాయి అత్యంత అధ్వానమైన ఆసియా కరెన్సీగా ఉంది. మొదటిసారిగా, డాలర్‌తో రూపాయి విలువ 80 దాటింది. ప్రస్తుతం 83.4 వద్ద ఉంది. ఇది చాలా భయంకరమైనది. తరుగుదల దేశం ముడి పదార్థాలు, ఇంధనాల నికర దిగుమతిదారుగా ఉన్నందున రూపాయి ప్రత్యక్ష ప్రభావం తయారీ రంగంపై ఉంది' అని అన్నారు. 'ఈ ఆర్థిక సంవత్సరంలో తయారీ రంగం ఇప్పటికే ఒత్తిడి సంకేతాలను చూపడం ప్రారంభించింది. ఆర్‌బిఐ ప్రకారం, రూపాయి విలువలో ప్రతి ఐదు శాతం పతనం, ద్రవ్యోల్బణం 15 శాతం పెరుగుతుంది' అని ఆయన పేర్కొన్నారు.

సభలోకి ప్లకార్డులు తీసుకురావద్దు : స్పీకరు

లోక్‌సభ ఎంపిలు సభలో ప్లకార్డులు తీసుకురావద్దని మంగళవారం స్పీకరు ఓం బిర్లా హెచ్చరించారు. పార్లమెంట్ గౌరవం, క్రమశిక్షణను కొనసాగించాలని సూచించారు. తనను కించపరిచే వ్యాఖ్యలు చేసిన బిజెపి ఎంపి రమేశ్ బిధురిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బిఎస్‌పి ఎంపి డానిష్ అలీ తన మెడకు ప్లకార్డును వేలాడుదీసి నిరసన తెలిపారు. ఈ నిరసన తెలిపిన ఒకరోజు తరువాత స్పీకర్ ఈ వ్యాఖ్యలు చేశారు.

క్వార్టర్స్‌కు తమిళనాడు

విజయ్ హజారే టోర్నీ



ముంబయి: విజయ్ హజారే టోర్నమెంట్ క్వార్టర్‌ఫైనల్లోకి తమిళనాడు జట్టు దసుకెళ్లింది. మంగళవారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో తమిళనాడు జట్టు స్పిన్నర్ వరణ్ చక్రవర్తి(5/9) లిస్ట్-ఏ క్రికెట్‌లో అత్యుత్తమ బౌలింగ్‌తో చెలరేగడంతో నాగాలాండ్‌పై 10వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. గ్రూప్-ఇలో నాగాలాండ్ జట్టు తొలిగా బ్యాటింగ్‌కు దిగి 19.4ఓవర్లలో 69పరుగులకే కుప్పకూలింది. వరుణ్ చక్రవర్తికి తోడు సాయి కిషోర్(3/21) బౌలింగ్‌లో రాణించారు. అనంతరం తమిళనాడు జట్టు 7.5ఓవర్లలో వికెట్లేమీ కోల్పోకుండా 73పరుగులు గెలిచింది. ఓపెనర్లు సాయికిషోర్(37), నారాయణ జగీశన్(30) వికెట్ కోల్పోకుండా మ్యాచ్‌ను ముగించాడు. దీంతో గ్రూప్-ఇలో తమిళనాడు 20పాయింట్లతో నేరుగా క్వార్టర్స్‌కు చేరింది. నేటితో గ్రూప్ లీగ్ పోటీలు ముగియగా.. శనివారం బెంగాల్-గుజరాత్, కేరళ-మహారాష్ట్ర జట్ల మధ్య జరిగే మ్యాచ్‌లతో క్వార్టర్‌ఫైనల్ బెర్తులు ఖరారు కానున్నాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68